నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నమ్మలేని నిజాలు**

లోహవిహంగం
స్వదేశి పరిజ్ఞానం
జాతికి గర్వం.

గాలి నాణ్యత
ఆరోగ్య విశ్వహిత
రోగ మహిత.

కోళ్ల వ్యర్థాలు
ఎన్నోరూపాంతరాలు
చివర పేట్లో.

టీచర్ క్రియేటర్
విలువైన డైరెక్టర్
పిల్లల ఫ్యూచర్.

అంటు వ్యాధులు
వానకాలం జబ్బులు
గోలీల గోల్ మాల్.



– రేడియమ్
సెల్: 9291527757


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com


**శ్రీనిజాలు**

ఎదురు చూసామిన్నాళ్లు
ఏదేదో భ్రమసి !
హైడ్రాకు లేదా మరొక
హృదయమున్న మనిషి !
బుల్డోజర్ హైడ్రాకే
తలిగె గజ్జి ముసురు !
పేద వాళ్ళ ఇండ్లుకూల్చ
ముట్టుతుంది ఉసురు !



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


హైదరాబాద్ గురువారం 30-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:279 పేజీలు:6 వెల: రూ.1/-


## హైడ్రాపై మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జులై 29: హైడ్రాపై తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

**ఈనెల 31న ఎన్డీఎస్ఏ సమావేశం**

కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈరోజు (బుధవారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

**మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నాం..**

కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.

**నాసిరకం డిజైన్‌తోనే కాళేశ్వరం కూలింది..**

కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఫ్లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాఫర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో రెయిన్ అలర్ట్

హైదరాబాద్, జులై 29: ఉత్తర తెలంగాణలో కాసేపు తగ్గిన వర్షాలు మళ్లీ ఉధృతం కానున్నాయి. విదర్భ?ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి వర్ష మేఘాలు తెలంగాణ వైపు కదులుతుండటంతో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. హైదరాబాద్‌లో సాయంత్రం నుంచి రాత్రి వరకు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి.

తెలంగాణలో వర్షాలు మరోసారి తీవ్రరూపం దాల్చనున్నాయి. ఉదయం నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కురిసిన ఎడతెరిపి వర్షాలకు కాసేపు విరామం లభించినప్పటికీ, విదర్భ?ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి భారీ వర్ష మేఘాలు తెలంగాణ వైపు కదులుతున్నాయి. దీంతో రానున్న కొన్ని గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు.రానున్న రెండు గంటల్లో ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా. అలాగే మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. వికారాబాద్, వనపర్తి, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి.



### ఉదయం నుంచి ఈ జిల్లాల్లో ఎడతెరిపి వర్షాలు

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాల ప్రభావం క్రమంగా హనుమకొండ, వరంగల్, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు విస్తరించే అవకాశం ఉందని వాతావరణ విశ్లేషకులు పేర్కొన్నారు. అదేవిధంగా కామారెడ్డి, సిద్ధిపేట, జనగామ, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విస్తృతంగా ఓ మోస్తరు వర్షాలు కొనసాగే అవకాశముందని తెలిపారు.

**రాధశ్రీ రాగాలు**

వేయి స్తంభాల గుడి
విమల సంస్కృతికి మడి
తెలంగాణమునకు నుడి
అనుచు రాధశ్రీ !!
లక్నవరము సరస్సు
రంజించును మనస్సు
తలప నింద్ర ధనస్సు
అనుచు రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

## రంగనాథ్ వ్యవహారంపై ప్రభుత్వ కీలక నిర్ణయం

హైదరాబాద్, జులై 29: హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ వ్యవహారంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం తదుపరి న్యాయ పోరాటానికి సిద్ధమవుతోంది. ఈ అంశాన్ని హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు సవాల్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సమాచారం ప్రకారం, ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డితో పాటు ఇతర సీనియర్ న్యాయ నిపుణులతో సమావేశమై తదుపరి న్యాయ వ్యూహంపై చర్చించనున్నారు. పూర్తి తీర్పు ప్రతిని పరిశీలించిన అనంతరం అప్పీల్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ను ఆ పదవి నుంచి వెంటనే తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు పెండింగ్‌లో ఉండటాన్ని ధర్మాసనం తీవ్రంగా పరిగణించినట్లు న్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి. విచారణ సందర్భంగా రంగనాథ్ బేషరతుగా క్షమాపణలు కోరినప్పటికీ, వాటిని ధర్మాసనం ఆమోదించలేదని సమాచారం.






## హైడ్రాను ముంచుతామంటారా?'..

### కేటీఆర్‌పై తుమ్మల ఫైర్

హైదరాబాద్, జులై 29: హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు.

రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై కేసును మూసేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జులై 29: బొగ్గు గనుల కేటాయింపు కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ఉన్న క్రిమినల్ కేసును, ఆయనకు జారీ చేసిన సమన్ల ఉత్తర్వును దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రద్దు చేసింది. ప్రత్యేక కోర్టు గతంలో జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను కొట్టివేస్తూ కేసును శాశ్వతంగా క్లోజ్ చేసింది.

చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో పాటు ఇతరులకు విచారణ సంస్థ క్లీన్ చిట్ ఇస్తూ సమర్పించిన క్లోజర్ నివేదికలను సుప్రీంకోర్టు ఆమోదించింది.

సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టులను తోసిపుచ్చి, ట్రయల్ కోర్టు మన్మోహన్ సింగ్‌కు సమన్లు జారీ చేయాల్సిన అవసరం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

'విచారణ సంస్థల నివేదికల స్వీకరణపై ఈ కోర్టు గతంలో వెలువరించిన మార్గదర్శకాల ఆధారంగా చూస్తే, సీబీఐ అందించిన క్లోజర్ రిపోర్టులను తోసిపుచ్చి స్పెషల్ జడ్జి కేసును విచారణకు స్వీకరించడానికి ఎటువంటి బలమైన కారణం కనిపించడం లేదు. అందుకే మేము ఈ అప్పీల్‌ను అనుమతిస్తూ కేసును క్లోజ్ చేస్తున్నాం' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## అమిత్ షా స్టేట్మెంట్ ఇవ్వాలి.. ఉభయసభలు వాయిదా

న్యూఢిల్లీ, జులై 29:పార్లమెంట్‌లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. లోక్‌సభలో ఇవాళ కూడా విపక్ష సభ్యులు ఆందోలన చేపట్టారు. సీజేపీ కార్యకర్తులు, విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్ అంశంలో.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలని కోరుతూ విపక్షాలు డిమాండ్ చేశాయి. సమావేశం ప్రారంభమైన తర్వాత ప్రశ్నోత్తరాల సమయాన్ని నిర్వహించాలని స్పీకర్ ఓం బిర్లా కోరారు. కానీ విపక్ష సభ్యులు షా స్టేట్మెంట్ కోసం పట్టుపట్టారు. విపక్ష సభ్యులు ఎంతకీ తగ్గకపోవడంతో.. స్పీకర్ బిర్లా సభను 12 గంటలకు వాయిదా వేశారు.

అయితే యాంటీ పేపర్ లీకేజీ బిల్లుపై మంగళవారం చర్చ ప్రారంభమైన విషయం తెలిసిందే.మరో వైపు రాజ్యసభలో కూడా విపక్ష సభ్యులు ఆందోలన చేపట్టారు. మల్లిఖార్జున్ ఖర్గే మాట్లాడుతూ విద్యార్థులను కొట్టిన వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆరోపించారు. ప్రజలు సురక్షితంగా లేదని, ప్రజాస్వామ్యం కూడా సురక్షితంగా లేదని ఖర్గే అన్నారు. బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలకు జేపీ నడ్డా కౌంటర్ ఇచ్చారు. శాంతి, భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు సహజంగా చర్యలు తీసుకున్నారని జేపీ నడ్డా అన్నారు. రాజ్యసభను కూడా 12 గంటల వరకు వాయిదా వేశారు.

## 'సర్' ప్రక్రియను వేగవంతం చేయాలి: భట్టి విక్రమార్క



న్యూఢిల్లీ, జులై 29:ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుంది: మహేశ్ కుమార్ గౌడ్**

'సర్'పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏ(ఃఒం)లను నియమించినట్లు చెప్పారు. 50 నుంచి 60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో వందశాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి 'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

**ఢిల్లీలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం..**

కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు (బుధవారం) జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీ చంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో 'సర్' ప్రక్రియ, పార్టీ – ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు.

కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, జులై 29:పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను తిరస్కరించింది. పరీక్షా పత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ సమావేశాలను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు.

కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇప్పటివరకు 3–5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5–10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది.

## ముందస్తుగా గుర్తిద్దాం.. క్యాన్సర్‌ను జయిద్దాం : హరీశ్ రావు

మెదక్, జులై 29:వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయించుకోవడం కంటే, రాకముందే గుర్తించి నివారించుకోవడం ఉత్తమ మార్గం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పష్టం చేశారు. ప్రారంభ దశలో గుర్తింపే క్యాన్సర్‌పై విజయానికి కీలకం అన్నారు. సిద్దిపేటలోని విపంచి ఆడిటోరియంలో సింధూ హాస్పిటల్ సహకారంతో నిర్వహిస్తున్న 2 రోజుల ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని హరీశ్ రావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఆరోగ్యం కంటే గొప్ప సంపద మరొకటి లేదని, వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే ముందుగానే గుర్తించి నివారించుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. క్యాన్సర్‌కు భయపడాల్సిన అవసరం లేదని, ప్రారంభ దశలో గుర్తిస్తే అనేక రకాల క్యాన్సర్లను పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన మహిళలు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. కేన్సర్ వ్యాధితో కుటుంబాలు అన్ని రకాలుగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మారిన జీవనశైలి ఆహారపు అలవాట్లు క్యాన్సర్ కేసుల పెరుగుదలకు కారణమవుతున్నాయి అన్నారు.

ఈ శిబిరంలో నిర్వహిస్తున్న మామోగ్రామ్, పాప్ స్మియర్ వంటి పరీక్షలు సాధారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చవుతాయని, ఇక్కడ మాత్రం పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హరీశ్ రావు కోరారు. పొగాకు, గుట్కా, పాన్ మసాలా వంటి అలవాట్లు నోటి క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని పేర్కొంటూ, అలాంటి అలవాట్లను కుటుంబ సభ్యులకు మాన్పించే బాధ్యత అందరిదని హరీశ్ రావు అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, జిల్లాల వారీగా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలు, 'ఆరోగ్య మహిళ' వంటి కార్యక్రమాలను అమలు చేసిందని హరీశ్ రావు గుర్తు చేశారు. ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే ఒక కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. ఒక కుటుంబం ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. అందుకే మహిళల ఆరోగ్య పరిరక్షణకు మేము ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు కూడా నాణ్యమైన వైద్య సేవలు పొందాలనే ఉద్దేశంతో సింధూ హాస్పిటల్ సహకారంతో ఈ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు.


'స్వచ్ఛ సిద్ధిపేటతోపాటు హెల్తీ సిద్ధిపేట కూడా మన లక్ష్యం కావాలి. ప్రతి ఇంట్లో ఉన్న మహిళలను ఈ శిబిరానికి తీసుకువచ్చి ఉచిత పరీక్షలు చేయించండి. ఒక చిన్న పరీక్ష ప్రాణాలను కాపాడగలదు' అని హరీశ్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సహకరించిన హైదరాబాద్ సింధూ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, నిర్వాహకులకు హరీశ్ రావుకృతజ్ఞతలు తెలిపారు.

**చురక**

అడ్డంకులు ఆంక్షలతో
హైడ్రా భారీ పరుగులు
సమీక్షించి తప్పొప్పులు
సరిచేస్తేనే మెరుగులు.
సర్కారు భూములన్నీ
సంరక్షణే కదా ధ్యేయం
పలుకుబడి కబ్జాకోర్ల
ప్రక్కనేస్తే కాదా గాయం



-వేల్పుల నారాయణ
9440433475




బుధవారం కళాసుబ్బారావు కళావేదికలో ఎందరో మహానుభావులు మధుర స్మృతులలో భాగంగా కవి, సాహితీవేత్త, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య డా॥ సి. నారాయణరెడ్డి జయంతి సందర్భంగా జరిగిన సభలో ప్రసంగిస్తున్న తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ ఏనుగు నరసింహారెడ్డి–ఐ.ఏ.ఎస్., వేదికపై రాధారాణి, పి.యస్.ఆర్.మూర్తి, కళా వి.యస్.జనార్ధనమూర్తి, శైలజామిత్ర.

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 30-7-2026

## సప్త పదులు

ప్రక్రియ సృజనకర్త: సుధామ



సమావేశము
ప్రవేశము
అనర్థానికి
దారితీస్తుంది
కొందరి అనవసర
ఆవేశము
-బెన్నూరి వనజాక్షి
హైదరాబాద్

గెలుపు
తెలుపు
ఒక్క విజయం
ఓటముల
బూజు
దులుపు.
-పట్నాల ఈశ్వరరావు
విజయనగరం

కలుపుకోవాలి
పిలుచుకోవాలి
జీవితమనే
ప్రయాణంలో
కష్టాలను
ఆత్మస్థైర్యంతో
ఎదుర్కోవాలి.
-జి. కె.నారాయణ

ఆరోపణ
నిరూపణ
తప్పు నీదైతే,
చెప్పి
తీరాలి
క్షమాపణ..
- ఋష్యశృంగు ఢిల్లేశ్వరరావు

కావాలి
కోరుకోవాలి
కుటుంబములో
అందరు
బరువులు
బాధ్యతలు
పంచుకోవాలి
-ప్రసాద్ రావు,
విజయనగరం.

మెరిసింది
విరిసింది
తెలుగు యువత
విక్రంతో
దేశం
మురిసింది
-అచ్యుతుని రాజ్యశ్రీ
హైదరాబాదు

# వానా-పిల్లలూ



'మేంగో' కాలమ్

మా పిల్లలందరికీ గొప్ప సంతోషం కలిగించేదేంటో మీకూ తెలుసు. ఈ మాట పెద్దవారితో అంటున్నాను. మీరూ ఒకప్పుడు చిన్నపిల్లలే కదా!

అది వాన!

మబ్బులు పట్టుకువస్తాయి. చల్లగాలి వీస్తుంది. ఆకాశంలో ఓ మూల ఇంద్ర ధనుస్సు కనిపిస్తుంది. ఎక్కడో ఓ మెరుపు. చిన్న ఉరుము. చెట్ల మీద నుండి పక్షులు గాల్లోకి ఎగురుతాయి. మనుషులే కాదు చెట్లు, మొక్కలు, పశువులు అన్నీ వాన చినుకులకు స్వాగతం పలుకుతాయి. అప్పుడే కదా పిల్లలు పరుగులు తీసుకుంటూ ఇళ్ళ నుండి బయటకు వస్తారు. ఎవరో పాట అందుకుంటారు.

పిల్లలు నర్తించటం మొదలుపెడతారు. పిల్లలు మాత్రమేనా! నెమళ్ళు పురివిప్పుతాయి అంటారు. అలాంటి దృశ్యాలు సినిమాలలో చూశాం. ఓ రకంగా చెప్పాలంటే ప్రకృతి నాట్యం చేస్తుంది. అమ్మలు కొంతసేపు పిల్లల్ని వదిలేస్తారు. వాన పెరుగుతుంటే అప్పుడు వారు తుండు గుడ్డలు తీసుకుని వస్తారు. తలల మీద వేసి, జ్వరం వస్తుంది, జలుబు చేస్తుంది అంటూ పిల్లలు మారాం చేస్తున్నా లాక్కుపోతారు.

జ్వరం వస్తే రానీ, జలుబు వస్తే రానీ, తొలి వాన కదా. దాన్ని నిలువెల్లా తడుస్తూ అనుభూతి చెందాలి కదా! ఇది పిల్లల మనోగతం.

ఇలా రాస్తుంటే మీకు కవిత్వం అనిపిస్తుందా?

అవును. ఈ మాటలన్నీ మీ నుండి నేర్చుకున్నవే. 'వాన' గురించి రాయని కవులు, కవయిత్రులు ఎంతమంది వున్నారు? ఎన్ని వాన పాటలు. ఎన్ని 'వాన' నేపథ్యంలో వచ్చిన సినిమాలు. ఇందులో అనేక రకాలున్నాయి. కొంతమంది దర్శకులు రకరకాల వానలను అద్భుతంగా చిత్రీకరించారు కదా. ఇప్పటికీ అది గంభీరమైన లేదా పోరాట సందర్భంగా అయినా, అత్యంత విషాదమైనా వాన కురవాల్సిందే కదా.

ఇది కదా దేవుడు లేదా సృష్టి మనకు ప్రసాదించిన వరం.

అసలు వానలు కురిస్తేనే నదులు ప్రవహిస్తాయి. భూమి తడుస్తుంది. పంటలు మొలకెత్తుతాయి. కరెంట్ వస్తుంది. లేకపోతే కరువు, విలయాలు రాజ్యం ఏలతాయి. వానలు ఎప్పుడూ ఆనందాన్ని మాత్రమే తీసుకురావు. అవి వరదలను తీసుకువస్తాయి. వానా, గాలి తోడయినప్పుడు మహా వృక్షాలు నేలకు వొరుగుతాయి. ఇళ్ళు కూలతాయి. వంతెనలు కూలతాయి. అవి ఉప్పెనలుగా మారవచ్చు. అయినా వానలను మనం ద్వేషించలేం.

ప్రకృతి మనుషుల్లా కాదు. తన పనులు తను చేసుకుంటూ పోతుంది. అలాంటి నిజాయితీ మనుషుల్లో లేదు.

ఇన్ని ఎండలను భరించాం. పిల్లలందరికీ బడులు తెరవటానికి ఓ వారం రోజులు సెలవులు పెంచారు. అన్న, విదూ, నేనూ తొలకరి జల్లుల కోసం ఎదురు చూస్తున్నాం-మా పిల్లలందరితో పాటు.

ఎక్కడా మబ్బులు కనిపించటం లేదు. చల్లటి గాలులు వీయటం లేదు. నెమళ్ళు ఏమైపోయాయో తెలియటం లేదు. ఇప్పుడు పత్రికల్లో, టీ.వీ.ల్లో 'ఎల్ నినో' అంటున్నారు. అంటే ఈ సంవత్సరం వానలు కురవవు. చాలా తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది అంటున్నారు. వరి పంటలు వేయకండి అని చెబుతున్నారు. ఇప్పటికే ఆహార పదార్థాలు నేలమాళిగల్లో దాచిపెట్టారంటున్నారు.

అంటే కరువు పరిస్థితులు ఇప్పటికే మొదలు అయ్యాయి.

ఇవన్నీ ప్రకృతి చేస్తున్నదా? దేవుడు చేస్తున్నాడా? మనుషులు చేస్తున్నది కాదూ. శ్రీశ్రీ గారు 'దేవుడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా! వినండి మనుషుల గోల' అంటూ ఎప్పుడో పాట రాశారని మా తాత చెబుతుంటారు. మేం కూడా విన్నాం.

'నువ్వొస్తానంటే నే వద్దంటానా' అని వాన పాట వుంది.

'రెయిన్ రెయిన్ గో ఎవే' అనే పాట వుంది. పాటలకు పరవశించి అప్పటికప్పుడు వానలు కురిసిన సన్నివేశాలున్న సినిమాలున్నాయి.

పిల్లలూ ఎన్ని వానలు కురుస్తున్నా 'గో ఎవే' అని పాడకండి. పిల్లలూ, దేవుళ్ళూ ఒకటే అంటారు. మీవి వేదవాక్కులు. తథాస్తు దేవతలుంటారు అంటారు.

మనుషులకు ముందుచూపు వుండదా? ఎప్పుడూ పుష్కలంగా వానలు కురవవు. ఇది ప్రకృతి సూత్రం. చీమలు ఎందుకు ఆహారం నిల్వ చేసుకుంటాయి. మనుషులు కొందరు డబ్బుని, సంపదలను మాత్రం పోగు చేసుకుంటారు.

అందుకు ఎలాంటి పనులయినా చేస్తారు. అంతేకాదు మనకు ఈరోజు గడవటం కావాలి. రేపు గురించిన ఆలోచనలు రావు. వచ్చినా పట్టించుకోరు.

మనం చెట్లు నరుకుతాం. వంతెనల నిర్మాణంలో, రహదారుల నిర్మాణంలో అవినీతి. అందులో ఎవరి వాటాలు వారికి. ఇక్కడ శిక్షలు వుండవు. భయం వుండదు. ఎవరికి అందింది వారు దోచుకుంటారు. ఏ వాన వచ్చినా, రాకున్నా. వరదలు, ప్రళయాలు వచ్చినా మొదట ఆ ప్రభావం సామాన్యుడి మీద పడుతుంది. ఎందుకయ్యా మీకు అణ్వాయుధాలు, బాంబులు, మిసైళ్ళు-రకరకాల ఆయుధాలు. నదుల్ని అనుసంధానం చేయండి. తుఫాన్ దిశలను మార్చండి. ఎడార్లలోనూ మొక్కలు మొలిపించండి. అంత ఆధునికత మీరు అందిపుచ్చుకున్నారు కదా!

అందుకే ఇప్పుడు వానలు, ఎండలు, చలి, మనుషుల మీద పగబట్టాయి. ఒక చిన్న మార్పుతో మనుషుల ప్రపంచం కుదేలు అవుతుంది. ప్రకృతి శాశ్వతంగా మనుషుల మీద పగబట్టదు. ఎందుకంటే ఈ సృష్టిలో మనుషులు ఒక్కరే లేరు. వృక్షజాతులు, జంతుజాలం, పశుపక్ష్యాదులు, ఇంకా జీవ, నిర్జీవ పదార్థాలుగా కనిపించే మహా ప్రపంచం వుంది. కేవలం మనుషుల కోసం మిగతా ప్రపంచాన్ని ప్రకృతి కోల్పోవటానికి ఇష్టపడదు. అందుకే చిరునవ్వుతో మానవ లోకానికి ఓ సందేశం ఇచ్చింది.

'మీ మరణ శాసనాన్ని మీరు రాసుకోండి. మీరు రెండు ప్రపంచ యుద్ధాలనుండి గుణపాఠాలు నేర్చుకోలేదు. ఎప్పటికప్పుడు మూడో ప్రపంచ యుద్ధం అంచుల దాకా వెళ్ళి వస్తున్నారు.

గుర్తుంచుకోండి మీ మానవజాతికి అదే అంతిమ యుద్ధం.'

అవును ఇప్పుడు మాకూ అనిపిస్తోంది. రేపు మనుషులు వుండరు. ఈ ప్రపంచం వుంటుంది!



- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

## యాది పునాది



సాహస సహవాసినై తలెత్తి
ఆకాశ నేపథ్యాన్ని ఆస్వాదిస్తాను,
కాళ్ళూనే నేలే నా ఆది,
యాది, పునాది అని పాదాభివందనం చేస్తాను.

చేతులు చాచి కొమ్మల నిండా
చిగుళ్లనై దళాలనై విస్తరించి పచ్చ'ధనా'న్నిస్తాను
జ్ఞాన జ్వాలా కిరణాల్ని ఆకులతో
తాగి పూలై పుస్తకాలై పూస్తాను .

అంతరంగానంద తరంగాల మకరందామృతాన్ని
కాస్తాను, నన్నూ నిన్నూ తిత్తులనిండా
కొసరి కొసరి ఊపిరి నింపి బతికించిన
గాలికి సుమనోభావ గంధాన్నిచ్చి గౌరవిస్తాను.

సుస్థిరంగా విశ్వాసమై నిలిచి
విస్తృత వృక్షాన్నై బాష్పార్ద్రనేత్రాలతో
విశ్వమంతా విస్తరించిన
ప్రకృతికి ప్రాణమై ప్రణమిల్లుతాను.

(రోజూ నాకు పూజాసుమాలు ఇస్తున్న చెట్టుకు నమస్కరిస్తూ రాసుకున్న పదాలు.)



-ఆచార్య మాడభూషి శ్రీధర్
సెల్:8447651505

## ఒంటరి

పైన
వెన్నెల ప్రవాహం
లోన
బాధ్యతాసుడుల దాహం-

పైన
నవ్వులగొడుగు
లోన
ఒత్తిళ్ళమడుగు-

పైన
బంధాలగాలిపటం
లోన
తగిలిన దెబ్బల సలపటం-

పైన
ఉత్తమప్రశంసల జల్లు
లోన
నెత్తుటిగాయాల ముల్లు-

పైన
అందరు పొగిడే విజయగాథలు
లోన
అప్రకటిత బాధలు-

పైన
చైతన్య ప్రదర్శనలు
లోన
చెడిన ఆరోగ్యంతో ఘర్షణలు-

పైన
నాన్న
లోన
అమ్మ..

నాన్న
అందరికీ అన్నీ చేదుకొమ్మని
ఇచ్చి నిల్చిన
ఒంటరి ఎండుబావి-

నాన్న
అందరివాడైనా
తనకు తానేమీ కాని
వలసజీవి-

నాన్న
తనకు తానే దొరకనంత
దూరంలో..
తన వెనక ఏమీ లేని
శూన్యంలో.



-డాక్టర్ కాసర్ల
9441506252



# పితృత్వపునిశ్శబ్ద ఆఖ్యానం "లేఖ్య" కావ్యం

మెట్టా నాగేశ్వర రావు సృజించిన 'లేఖ్య' సమకాలీన సామాజిక సంక్షోభాల నేపథ్యంలో ఆడపిల్ల అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని పునః ప్రతిష్ఠించే ఒక అక్షర సమరం. యుగ యుగాలుగా పితృస్వామ్య భావజాలం నెత్తిన మోస్తూ, పుత్రుడే సర్వ స్వమని కలవరించిన సాహిత్య, సామాజిక చరిత్రల పునాదులను ఈ సంపుటి ఎంతో ఆర్ద్రతతో, చైతన్యంతో కదిలించింది. కొడుకు పుడితేనే స్వర్గప్రాప్తి, పరలోక గతులు ఉంటాయనే ప్రాచీన సూత్రాలు వినీ వినీ చెవులు తుప్పుపట్టిన సమాజంలో, ఒక తండ్రి తన కూతురమ్మ చుట్టూ అల్లుకున్న ఈ చైతన్యపు అక్షరమాల సమాజపు చంచల మనస్తత్వానికి గట్టి ఎదురుదెబ్బ. నేటి ఆధునిక కాలంలో కూడా ఆడపిల్ల పుట్టగానే కడుపులోనే చిదిమేసే భ్రూణహత్యలు, సమాజంలో అడుగడుగునా పొంచివున్న లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మోసపూరిత ప్రేమల వంటి భయానక వాతావరణం నెలకొని వుంది. ఇలాంటి భిన్నమైన, భయాందోళనలతో కూడిన సామాజిక స్థితిగతుల్లో ఒక కవిగా, అంతకంటే మిన్నగా ఒక బాధ్యతాయుతమైన తండ్రిగా నాగేశ్వరరావు తన బిడ్డ 'లేఖ్య' (అమ్ము) సాక్షిగా విశ్వజనీనమైన ఆడపిల్లల వేదనను, వారి ప్రతిఘటన శక్తిని ఇక్కడ ప్రతిభావంతంగా చిత్రించాడు.

ఈ సంపుటి శిల్ప వైశిష్ట్యం వక్తృత్వ శైలిలో సాగుతూనే అత్యంత గాఢమైన అనుభూతిని పాఠకుడి హృదయంలో స్థిరపరుస్తుంది. కవి తన సహజమైన సుదీర్ఘ కవితా శైలిని పక్కనబెట్టి, పసితనపు ముచ్చట్లను, యవ్వనపు సవాళ్లను చిన్న చిన్న పంక్తుల లో 'ఫ్రీజ్' చేసే ఒక అద్భుతమైన టెక్నిక్‌ను అవలంబించాడు. ఈ భావసౌధం నిర్మాణంలో ఎక్కడా కృత్రిమత్వం కనిపించదు, అంతా ఒక తండ్రి అంతరంగం నుండి స్వచ్ఛంగా ప్రవహించిన జీవన తరంగంలా ఉంటుంది.

> యుగ యు గాలుగా పితృస్వామ్య భావజాలం నెత్తిన మోస్తూ, పుత్రుడే సర్వ స్వమని కలవరించిన సాహిత్య, సామాజిక చరిత్రల పునాదులను ఈ సంపుటి ఎంతో ఆర్ద్రతతో, చైతన్యంతో కదిలించింది.

కూతురమ్మ పట్టీల సవ్వడిని, ఆమె అల్లరి చేష్టలను వర్ణించేటప్పుడు కవి శైలి అత్యంత లలితంగా, సుకుమారంగా సాగుతుంది. అదే సమయంలో సమాజంలోని కపటత్వాన్ని ఎండగట్టేటప్పుడు, ఆడపిల్లలను హింసించే నయవంచకులను హెచ్చరించేటప్పుడు ఆయన శిల్పం ఒక్కసారిగా వీరత్వంలోకి, రౌద్రంలోకి రూపాంతరం చెందుతుంది. ఈ వైరుధ్యాల కలయికే ఈ కావ్య శిల్పానికి ప్రాణము పోసింది. కవి ఈ సృష్టిలోని పంచభూతాలను ఆవాహన చేసుకుని ఆడపిల్ల ఉనికిని తాత్విక శిఖరాలపై నిలబెట్టిన తీరు ప్రశంసనీయం. ప్రకృతిలోని సకల శక్తుల సమతుల్యతకు, చైతన్యానికి ఆడపిల్ల రూపాంతరమే కొలమానమని చాటుతూ కవి రాసిన ఈ పంక్తులు శిల్ప, వర్ణనల పరంగా అత్యున్నత స్థాయిలో ఉన్నాయి.

**"ఆకాశానికి పంచె కట్టి**
**పెద్ద మనిషిలా నించోబెట్టగలవా!?**
**గాలికి సున్నం వేసి**
**తెల్ల కొంగలా మార్చగలవా!?**
**నిప్పుకి బొట్టు పెట్టి**
**బుట్ట బొమ్మలా కూర్చోబెట్టగలవా!?**
**భూమికి దారం కట్టి**
**గాలిపటంలా ఎగరేయగలవా!?**
**నీటికి పట్టీలు తొడిగి**
**ఆడపిల్లగా మార్చగలవా!?"**

ఈ వర్ణనలో భౌతికమైన అసాధ్యాలను ప్రకృతితో ముడిపెడుతూ, 'నీటికి పట్టీలు తొడగడం' అనే అపురూప భావన ద్వారా ఆడపిల్లలోని నైర్మల్యాన్ని, ఆమెలోని నిరంతర చైతన్య ప్రవంతిని కవి అభివర్ణించాడు. ఆమె పంచభూతాల ఆరో పంచప్రాణమని, ప్రకృతి లోని పరస్పర విరుద్ధ శక్తులను తనలో ఇముడ్చుకున్న మహాశక్తి అని ధ్వనింపజేయడం కవి తాత్విక పరిణతికి నిదర్శనం.

అభివ్యక్తి పరంగా 'లేఖ్య' సంపుటిది విలక్షణమైన ముద్ర అని చెప్పవచ్చు. లోకంలో ఆడపిల్ల పుడితే భారం అనుకునే సంకుచిత పితృస్వామ్య మనస్తత్వంపై కవి సంధించిన ప్రశ్నలు సమాజపు మూలాలను కదిలిస్తాయి. ఇద్దరు ఆడపిల్లలు పుట్టాక కూడా మగపిల్లాడే కావాలని మూడో కాన్పుకు సిద్ధపడే పురుషాధిక్య లోకానికి, ఆడపిల్ల పుట్టగానే పెంటకుప్పలపై విసిరేసే నికృష్టులకు కవి తన అక్షర శరాల ద్వారా కనువిప్పు కలిగించాడు. సమాజంలో వేళ్ళూనుకున్న ఈ వివక్షా పూరితమైన అజ్ఞానాన్ని ఎండగడుతూ కవి అత్యంత నిశితంగా, ఘాటుగా ఇలా వ్యక్తపరిచాడు.

**"తండ్రి కళ్ళలో తుఫాను**
**తల్లి గుండెలో సునామీ**
**అందరూ వామ్మో**
**ఎట్లానో అన్నారు**
**అర్థం కానిది ఏమిటంటే**
**ఈ మగాడ్ని కన్నది**
**ఏ మగాడు అనీ!?"**

ఈ పంక్తులలోని అభివ్యక్తి సమాజంపై ఒక శరఘాతంలా పనిచేస్తుంది. ప్రతి పురుషుడినీ కన్నది ఒక స్త్రీయే అనే పరమ సత్యాన్ని మరిచి, ఆడపిల్ల పుట్టకను ఒక శావంగా భావించే పురుష సమాజపు అహంకారాన్ని 'ఈ మగాడ్ని కన్నది ఏ మగాడు?' అనే ఒక్క ప్రశ్నతో కవి నిలువునా చీల్చివేశాడు. స్త్రీని చులకన చేసే లోకంలో పుట్టినందుకు ఒక తండ్రిగా పశ్చాత్తాపం చెందుతూ 'తల్లీ! క్షమించు... మన్నించు..' అని వేడుకోవడంలో సామాజిక ఆర్తి, అంతశ్చేతన ధ్వనిస్తాయి.

ఈ సంపుటి అంతటా వాత్సల్య భావం ఒక అంతస్సూత్రంలా ప్రవహిస్తూ పాఠకుడిని ఉద్వేగానికి గురిచేస్తుంది. తండ్రీ కూతుళ్ల మధ్య ఉండే బంధం కేవలం భౌతికమైనది కాదు, అది ఆత్మల అనుసంధానం. రోజంతా బతుకుపోరాటంలో, ఆఫీసు ఒత్తిళ్లలో నలిగిపోయి సాయంత్రానికి ఇంటికి వచ్చే తండ్రికి, ఇంట్లోని కాలి పట్టీల సవ్వడి, పసిపిల్ల కేరింతలు ఒక సంజీవనిలా పనిచేస్తాయి. కూతురి ఉనికితో తండ్రి గుండెపై దేవుడు వెలుస్తాడని కవి భావిస్తాడు. కూతురు పిలిచే ఒక్క 'నాన్న' అనే పిలుపు ముందు ఈ విశ్వంలోని సకల సామ్రాజ్యాలు, అత్యున్నత పురస్కారాలు వెలవెలబోతాయని చాటుతూ కవి తన వాత్సల్య తీవ్రతను ఇలా కుప్పపోశాడు.







ప్రతులకు:
మెట్టా
నాగేశ్వరరావు
9951085760

పుస్తక సమీక్ష

**"మా ఇంటి సెంటుసీసా**
**ఈ లేఖ్య!**
**మా వొంటి కంటి సీస**
**పద్యం లేఖ్య!**
**నాన్న అనడం అబ్బా..**
**ఎంత అదృష్టవంతుడు ఈ**
**నాన్న"**

కూతురమ్మను తన ఇంటి 'సెంటుసీసా'గా, తన శరీరం అంతా వ్యాపించిన 'కంటి సీస పద్యం'గా వర్ణించడంలో కవి హృదయ పరవశం, ప్రేమ మాధుర్యం అత్యంత సుందరంగా ఆవిష్కృతమయ్యాయి. పేరు ఏదైతే ఏంటి, పారే నదిని చూసినా, పడుకున్న నేలను చూసినా కూతురి రూపమే మనసు పలకపై బొమ్మవుతుందని, ఆమె తన జీవితానికి ఒక 'ఎన్సైక్లోపీడియా' అని కవి ప్రకటించడం తండ్రి ప్రేమకు పరాకాష్ఠ.

అయితే ఈ కవిత్వం కేవలం పసితనపు మురిపాలతో చేతులు దులుపుకోలేదు. పసిపాప క్రమంగా యవ్వనంలోకి అడుగుపెట్టే క్రమంలో ఆమెకు ఎదురయ్యే సామాజిక రుగ్మతలను, ఆంక్షల లోకాన్ని కవి ముందే దర్శనం చేశాడు. చదువు మాత్రమే స్త్రీకి నిజమైన ఆయుధమని, వంటింటి మంటల్లో ప్రతిభ మాడిపోకముందే అక్షరాల రెక్కలతో అందలాలెక్కాలని కవి ఆకాంక్షిస్తాడు. నేటి సమాజంలో ఆడపిల్లకు ఆర్థిక స్వేచ్ఛ ఎంత అవసరమో కవి లౌకిక తాత్వికతతో బోధించాడు. సమాజంలో ఆత్మగౌరవంతో బతకడానికి కూతురమ్మకు ఇచ్చే సందేశం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తుంది.

**"కూతురమ్మా!**
**నీ పర్సు నీవు సాధించుకోవాలె**
**నీ ఖర్చుకోసం ఎక్కడా ఊడిగం చేయకు**
**టీచరువైతావో లాయరువైతావో**
**లాఠీపడతావో నీ ఇష్టం**
**ఏదీ కాకపోయినా ఇడ్లీలమ్ముదాం**
**నీ ఆత్మగౌరవం కోసం నేను చెట్నీ రుబ్బుతాను"**

ఈ పంక్తులలోని తాత్వికత అత్యంత ఆచరణాత్మకమైనది. కూతురి ఆర్థిక స్వేచ్ఛ కోసం, ఆమె ఆత్మగౌరవం కోసం ఎంతటి శ్రమకైనా సిద్ధపడే తండ్రి ఆలోచనా విధానం నేటి సమాజానికి ఎంతో ఆదర్శవంతమైనది. సమాజంలో లంచపు సొమ్ముతో బతకవద్దని, తాను ఆర్జించే రూపాయి కళంకమంటని నీతి గల్ల కాసు కావాలని కూతురి వ్యక్తిత్వాన్ని మలిచిన తీరు ప్రశంసనీయం.

ధ్వని పరంగా ఈ కావ్యంలో ప్రతి వాక్యమూ ఒక గంభీరమైన అంతరార్థాన్ని కలిగి ఉంది. నేటి ఆధునిక డిజిటల్ యుగంలో ఫోన్లు, సోషల్ మీడియా యాప్స్ ఏ విధంగా ఆడపిల్లల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయో కవి అత్యంత సమకాలీన ధ్వనితో ఎండగట్టాడు. స్క్రీనే విశ్వం అనుకుని భ్రమపడే మాయా ప్రపంచాన్ని 'మాయలేడి'తో పోల్చాడు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మార్ఫింగ్‌లు, వాట్సాప్ చాటింగ్‌లు వంటివి జీవితాన్ని నాశనం చేసే స్పీడ్ బ్రేకర్లని హెచ్చరిస్తూ, జారిపోకముందే జాగ్రత్త వహించాలని, మోసాన్ని ముందే అరెస్ట్ చేసే విచక్షణ అనే 'డిటెక్టర్' మనసులో ఉండాలని ధ్వనింపజేశాడు. దుర్మార్గం జరిగిపోయాక ఏడ్చినా లాభం లేదని, సమయం వచ్చినప్పుడు ధైర్యంగా 'ఔా' చెప్పడమే నిజమైన చైతన్యమని బోధిస్తాడు.

కవి తన కూతురు కేవలం సమాజానికి భయపడే ఒక అబలగా మిగిలిపోవడాన్ని అస్సలు ఇష్టపడలేదు. లోకం నిందల మంటలతో చుట్టుముట్టినా, వేధించే దుష్ట మానుషులు ఎదురైనా ఆమె ఒక 'ఆడ బ్రూస్లీ'లా, ఒక 'ఉక్కుమనసు' కలిగిన యోధురాలిలా మారాలని కోరుకుంటాడు. ఒకవైపు పూరేకు లాంటి సుకుమారత్వం ఉన్నా, మరోవైపు రుద్రమదేవి రౌద్రం కనబడాలని ప్రతిఘటన తత్వాన్ని నూరిపోస్తూ కవి ఉద్బోధించిన తీరు ప్రేరణదాయకం:

> శూన్యానికి తలనిచ్చి, ఖాళీతనానికి కండను నింపి, ఈ దిక్కుమాలిన నేల మీద కూడా ఇంకా ప్రేమనే కురిపించే ప్రతి ఆడపిల్లకూ ఈ కావ్యం ఒక అక్షర నీరాజనం.

**"నువ్వు అబలవు అని ఎవరైనా అంటే**
**నిక్కత్ జరీనా... పంచ్ చూపించు**
**యుద్ధానికి పనికి రావంటే**
**సత్యభామ ప్రతిబింబానివై కనబడు"**

ఈ పంక్తులలో కవి ప్రాచీన, ఆధునిక ప్రతీకలను (సత్యభామ, నిఖత్ జరీనా) ఒకే చోటచేర్చి ఆడపిల్లలోని వీరత్వాన్ని మేల్కొలిపాడు. స్వేచ్ఛ అనేది ఎవరూ అడుక్కుంటే ఇచ్చేది కాదని, అది స్వచ్ఛ జలపాతమై దూకే స్వతంత్ర గుణమని చాటిచెప్పాడు.

పెంపకంలో ఉండాల్సిన మానవీయ విలువలను కవి కేవలం బోధనల ద్వారా కాకుండా స్వయంగా ఆచరించి చూపడం ఈ కావ్యంలో ఒక విశిష్టమైన అంశం. గండుచీమ కూతురిని కుట్టినప్పుడు, రివెంజ్ తీసుకోమన్న పాపకు అల్పజీవులపై కసి చూపవద్దని, చీమకు పంచదార వడ్డించి రావడం ద్వారా ఆమెలో 'ఎంపతీ' (సహానుభూతి) అనే గుణాన్ని నాటాడు. అలాగే ప్రకృతిని, జీవజాలాన్ని ప్రేమించే తత్వాన్ని బిడ్డకు నేర్పాడు. 'ఆకు రాలిపోయినట్టు మనమూ రాలిపోతాం, కానీ బతికున్నంత కాలం వసంతాన్ని పుష్పించినట్టు జీవితాన్ని పుష్పించాలి' అనే ప్రకృతి తాత్వికత ఈ కావ్యానికి మరింత వన్నె తెచ్చింది.

ఈ 'లేఖ్య' కావ్యం కేవలం మెట్టా నాగేశ్వరరావు గారి స్వగతం మాత్రమే కాదు, అది సామాజిక రంగస్థలంపై ప్రతి తండ్రీ కూతుళ్ల అనుబంధానికి ఒక నిరంతర సంభాషణ. శూన్యానికి తలనిచ్చి, ఖాళీతనానికి కండను నింపి, ఈ దిక్కుమాలిన నేల మీద కూడా ఇంకా ప్రేమనే కురిపించే ప్రతి ఆడపిల్లకూ ఈ కావ్యం ఒక అక్షర నీరాజనం. భావ ప్రకటనలో తేలికైన గాఢతను, శిల్పంలో ఆధునిక టెక్నిక్‌లను, అభివ్యక్తిలో నిశితమైన సామాజిక స్పృహను ప్రదర్శిస్తూ సాగిన ఈ 'లేఖ్య' కావ్యాన్ని తెలుగు సాహిత్యంలో అజరామరంగా నిలిచే ఒక పితృ హృదయ కావ్యంగా, ప్రతి తండ్రీ భద్రపరుచుకోవాల్సిన కూతురి జ్ఞాపకంగా మిగిలిపోతుందనడంలో సందేహం లేదు.



-డా॥పోతగాని సత్యనారాయణ
9441083763



# సి. నారాయణరెడ్డి జాతీయ కవితా పురస్కారం విశ్వంభర అందుకున్న కె.సచ్చిదానందన్

## పురస్కార గ్రహీత ప్రసంగం

అనుభవజ్ఞులు, ప్రముఖ తెలుగు కవి సి.నారాయణరెడ్డి పేరిట నెలకొల్పిన ఈ విశిష్ట గౌరవానికి కవిగా నన్ను ఎంపిక చేసుకున్న వేళ, గతంలో ఎంపికై ఈ గౌరవాన్ని స్వీకరించిన మహనీయులను, మన పూర్వకవులను నేను స్మరించుకునే ఈ సందర్భం నాకు ఎంతో మహత్తరమైన క్షణం.

కవిత్వం నాకు ఎక్కడి నుండి అబ్బిందో చెప్పలేను. నా పూర్వీకులు ఎవరూ కవులు కారు. ఆ విషయం ఆలోచించడానికి ప్రయత్నించినప్పుడల్లా, కేరళలో మా గ్రామంలో ఎడతెరిపిలేకుండా కురిసే వర్షాల విభిన్న స్వరధారలు వినిపిస్తాయి. నేను స్కూల్ విద్యార్థిగా చదివిన మలయాళ రామాయణంలో – కవి అంతులేని జలధి తరంగాల్లా అనంతమైన పద సంపద తన మనసుకు నిరంతరం అందించమని చదువుల తల్లిని ప్రార్థించే మహత్తరమైన పంక్తులు కూడా గుర్తుకు వస్తాయి. మా అమ్మ నాకు పిల్లలతో, కాకులతో, చెట్లతో మాట్లాడటం నేర్పింది; పవిత్ర భక్తి భావాల నిధి నా తండ్రి దేవుళ్ళతో, ఆత్మలతో సంభాషించడం నేర్పాడు. విసిగించే దైనందిన జీవన ప్రాపంచిక నైచ్యం నుండి తప్పించుకోవడానికి, నాకు ఒక సమాంతర ప్రపంచాన్ని సృష్టించడం నేర్పింది నా పిచ్చి అమ్మమ్మ. మరణించి కనుమరుగైనవారు మట్టిలో మట్టిగా మమేకమవడం నేర్పించారు. గాలి కనబడకుండా కదలడం, కదిలించడం నేర్పింది. వర్షం నా స్వరానికి వెయ్యి విధాల శృతిమార్పుల నైపుణ్యత ఇచ్చింది. ఇలాంటి గురువుల శిక్షణలో నేను కవిని కాకపోవడం అనేది సాధ్యమేనా?


నేను మా ఊళ్ళో ఉన్నంత వరకూ ఆ మనోజ్ఞత గమనించకపోయినా మా ఊరు ఒక సౌందర్యసీమ. వరదలు వచ్చినప్పుడు నిండునీటి కుండలయే వరి పొలాలతో, కోతలయ్యాక ఆగస్టు నెలలో వచ్చే నీలిరంగు పువ్వులతో పరచుకు అలరించే పొలాలు, పేరుతెలిసినవి , తెలియనివి తీగలు, పువ్వులు కనువిందుచేసే గుట్టలు, ఉప్పునీటికయ్యల కాలువల్లో మనుషులతో, సరుకులతో వచ్చిపోయే చిన్న పడవలు, ప్రశాంతమైన దేవాలయాలు, మసీదులు, చర్చ్ లు అసలు దేవుళ్లను తలపించేవిగా ఉండేవే తప్ప ఇప్పటిలా దెయ్యాలను పురికొల్పేవికాదు. మా కుటుంబం పూజించే హిందూ దేవుళ్ళు, దేవతల గోయా బొమ్మలు గాంధీ అనంతర కాలానికి సరితూగేట్టు అనిపించేవి. అధివాస్తవికత (సర్రియలిజం)లో నా రెండో పాఠం ఇది. నాలుగు సంవత్సరాల వయస్సులో నన్ను దాదాపుగా చావు అంచుకు తీసుకువెళ్ళి మూడు నెలల సుదీర్ఘ కాలం పీడించిన టైఫాయిడ్ జ్వరం మొదటిది. నా తొలి కవిత్వాన్ని కుప్పలు తెప్పలు చేసిన స్పానిష్ చిత్రకారుడు డాలీ చిత్రాల లాంటి అప్పటి పీడకలలు.

ఈ సందర్భంలో ఒక కవిగా నేను సాధించిన అల్ప విజయాలకు కృతజ్ఞతలు చెప్పవలసిన వారు ఎందరో. నా కుటుంబం, ముఖ్యంగా నా జీవిత భాగస్వామి. ఎప్పటికప్పుడు ఎవరి మద్దతు లేనట్టయితే నేను నా వృత్తిని, నా ప్రవృత్తి రచనను ఒకేసారి కొనసాగించడం అసాధ్యమయ్యేదో వారికి, స్కూళ్ళలో , కాలేజీల్లో నా ఉపాధ్యాయులు కొందరు (వారి మాధ్యమం మలయాళం) చదవడానికి, రాయడానికి ప్రోత్సహించి, ఆత్మవిశ్వాసంతో నన్ను కవిత్వ పోటీలకు పంపారు. బీదరికం నేపథ్యం నుండి వచ్చిన నా సహాధ్యాయులు నా కంటే ఘోరమైన బాధల ప్రపంచం వాస్తవం నాకు చూపించిన వాళ్ళు, సాహిత్యంలో ఆధునిక కవిత్వం ప్రధాన స్రవంతిలోకి రావడానికి ముందు, పేరున్న పత్రికలు నా వంటి వారి రచనలు అడగక మునుపే, సంప్రదాయవాద విమర్శకులు ఎగతాళి చేసి చిన్న చూపుచూసే నాలాంటి కవుల రచనలు ప్రచురించ సాహసించిన చిన్న పత్రికల సంపాదకులు, అయ్యప్ప ఫణిక్కర్ వంటి గొప్ప కవులు కవిత్వం, విమర్శ, కవిత్వ అనువాదాలను తీవ్రంగా పరిగణించమని నన్ను పురికొల్పడం, తత్ఫలితంగా ఎన్నో సంవత్సరాల కృషి రూపంగా , ముప్పై నిమించి నా స్వంత కవితా సంకలనాలు, అనేక కవిత్వ అధ్యయనాలు, సుమారు మూడు వేల పేజీల ప్రపంచ కవిత్వ అనువాదం వెలువరించగలిగాను. సరికొత్త భావ వ్యక్తీకరణ, నుడికారం కోసం చేసే సాధారణ అన్వేషణలో తోటి కవులు, కళాకారులు, చిత్ర నిర్మాతలు నాటక రచయితలు నా సహచరులుకావడం, కవిత్వమే కాకుండా ఇతర కళల గురించి వ్రాయడానికి, అత్యుత్తమమైన ప్రపంచ సినిమాలు, రంగస్థల ప్రదర్శనలు చూసేందుకు , ప్రపంచ వ్యాప్తంగా ఆరు ఖండాల్లో అత్యుత్తమ కళా ప్రదర్శన శాలలను దర్శించడానికి నన్ను ప్రోత్సహించిన వారు, ఎప్పుడూ పుస్తకాలతో నిండుగా కళకళలాడుతూ ఉండే మా ఊరి సంపన్న గ్రంథాలయాల్లో మొట్టమొదటిసారి భారతీయ, ప్రపంచ రచనలలో అనువాదాలు చదివాను. అనువాద కళలో మలయాళ భాష ఇప్పటికీ అగ్రగామిగా ఉంది. నేను చదివిన కాలేజీలలో మన కావ్యేతిహాసాలు, షేక్స్పియర్ మాత్రమే కాకుండా , రిల్కే, నెరుడా, మల్లార్మే మొదలు ఇలియట్, ఆడెన్, యేట్స్ వరకు సమకాలీన కవుల, ఇంగ్లీషు, అనేక ఇతర భాషల ఆంగ్ల అనువాదాల వల్ల నాటక రచయితల, కథా రచయితల పరిచయ భాగ్యం కలిగింది. ముఖ్యంగా నాలుగు పుస్తకాలు నా నైతిక, సౌందర్య కల్పనా నైపుణ్యం మీద శాశ్వత ప్రభావాన్ని చూపాయి. అవి : మహాభారతం, పవిత్ర బైబిల్, ధమ్మపద , సత్యంతో నా ప్రయోగాలు. నా సహచరులు, ముఖ్యంగా రచయితలు, అల్లకల్లోలంగా ఉన్న డెబ్భైలలో నా కవిత్వానికి చారిత్రిక స్పృహను ఇచ్చారు; అశోక్ వాజ్పేయి వంటి సాంస్కృతిక దార్శనికులు, నా సాహిత్య జీవితపు తొలినాళ్ళలో భోపాల్ లోని భారత్ భవన్ కార్యక్రమాలలో నన్ను కూడా భాగస్వామిని చేయడం ద్వారా, అరుణ్ కోలాట్కర్, కేదార్ నాథ్ సింగ్ మొదలు ఆక్టేవియో పాజ్ , టోమస్ ట్రాన్స్ ట్రోమర్ వరకు భారతదేశంతో సహా విదేశాల్లోని అత్యుత్తమ కవులతో నాకు ప్రత్యక్ష పరిచయం ఏర్పడటానికి సహాయం చేశారు. ఢిల్లీలోని సాహిత్య అకాడమీలో నా పద్నాలుగేళ్ల ప్రస్థానం, ఉత్తమ రచయితలను కలవడానికి భారతదేశం లోపల, వెలుపల ప్రయాణించడానికి నాకు గొప్ప అవకాశాలు కల్పించింది. జీవితం గురించి సాహిత్యం గురించి నా దృష్టిని విస్తృతం చేయడానికి సహాయపడిన అనేక సాహిత్య ఉత్సవాలు, పుస్తక ప్రదర్శనలకు నన్ను సిఫారసు చేసిన నా అనామక పాఠకులు; దానివల్ల ఎన్నో యాత్రా చరిత్రలు రాయగలిగాను. హిందీ, బెంగాలీ, మరాఠీ, తమిళం, అరబిక్, ఐరిష్, ఫ్రెంచ్, ఇటాలియా, స్పానిష్, చైనీస్, జపనీస్, జర్మన్ భాషలతో సహా ఇరవై భాషల్లో నా కవితలను అనువదించి ప్రచురించిన కవులు, సంపాదకులు, ప్రచురణకర్తల వల్ల ఇప్పుడు నాముప్పై అయిదుకు పైగా అనువాద కవితా సంకలనాలు నాకు ఖండాంతరాల్లో కూడా పాఠకులను సంపాదించి, అనేక ఆహ్వానాలు, సన్మానాలు తెచ్చిపెట్టాయి. నా కవితలను, పుస్తకాలను చదివి వ్యాఖ్యానిస్తూ వచ్చిన నా తొలి పాఠకులను మర్చిపోవడం అసలు భావ్యం కాదు. కవిత్వం, కళ కోసం అనేక స్వల్పకాలిక అవాం ట్–గార్డ్ పత్రికల భాగస్వాములు, నా జీవి తంలో వివిధ సమయాల్లో నేను సంపాదకత్వం వహిం చాను అని భావించిన రెండు ఆన్ లైన పత్రికల్లో ఒకటి, గీతా హరిహరన్ తో సహ–సం పాదకత్వం వహించిన గుప్త్ గూ ; అనంతర నిర్మాణ (పోస్ట్– స్ట్రక్చరల్) విమ ర్శలో నా పరి శోధనకు మార్గనిర్దే శం చేసిన వారు, నా కవిత్వానికి సహా యం చేయకపో యినా, సంక్లిష్టమైన అర్థ సంబంధిత శాస్త్రం భావప్రకటన విధా నం, మానసిక– భాషా ప్రక్రియలు బాగా గ్రహించడానికి చదవడానికి, రచన కు చాలా ఉపకరిం చాయి.

నా కవిత్వం వివిధ దేశాల లో వివిధ స్థాయిలలో గుర్తింపు పొందటానికి, ఈ ప్రస్తుత గౌరవ సమ్మానంతో సహా, అర్హమైనవిగా భావించిన పాఠకులు, న్యాయమూర్తులు, జీవితం తొలినాళ్ళలోనే ప్రారంభించిన కవిత్వం, విమర్శ, తాత్విక, సైద్ధాంతిక రచనలతో పాటు పిల్లల కవిత్వం, నాటకాలు, చిన్న కథలు, గజల్స్ వ్రాయడా నికి నన్ను ప్రేరేపించిన వారు...ఇలా –ఎందరో మహానుభావులు.

నేను భావించే కవిత్వం కేవలం పదాల కూర్పు చేర్పుల ఆట ఎంత మాత్రమూ కాదు; అది చెప్పలేని సముద్రం నుండి ఉత్తుంగ తరంగమై పైకి లేస్తుంది, ఏ మాత్రం నిలవలేని దాన్ని చెప్పడానికి ప్రయత్నిస్తుంది, పేరులేని వాటికి నామకరణంచేసేందుకు ప్రయత్నిస్తుంది. గొంతు లేనివారికి స్వరాన్నిస్తుంది. ఇది కేవలం స్థిరీకరించిన విలువలు, గుర్తించిన సత్యాల పునరుత్పత్తి కాదు; ఇటాలో కాల్వినో చెప్పినట్లుగా, రోజువారీ రాజకీయాల రంగుల వర్ణచిత్రా నికి అతీతంగా చూసే కన్ను , సామాజిక శాస్త్రం పౌనఃపున్యాలకు అతీతమైన కళ. నికానోర్ పర్రా ప్రసిద్ధ పదబంధం ప్రకారం ఇది సారరహితమైన మట్టిని పెళ్ళగించి తిరగదీస్తుంది. ఖాళీ పేజీలో ముందుకు సాగుతుంది– అది ఆవిష్కరించే సత్యాలు తక్షణం ఉపయోగ పడకపోవచ్చు. కానీ క్రమంగా సామాజిక చైతన్యంలో ఒక భాగమవుతుంది. అండలూసియన్ జనాదరణ పొందిన ఉపన్యాసంలో ఒక సాధారణ పదమైన డ్యూయెండే గురించి లోర్కా మాట్లాడేవాడు: అరబిక్ సంగీతం, నృత్యంలో ఉన్నట్టుండి దైవత్వ దర్శనం ప్రేక్షకులను అల్లా, అల్లా అని కేకలు పెట్టేలా చేస్తుంది. ఇది గోథే, పగనిని కళలో చూసే అస్పష్టమైన రహస్యం, జిప్సీ నృత్యకారిణి లా, మలెనా బ్రెయిలోవిస్కీ వాయించిన బాక్ సంగీతంలో అనుభవించిన దైవిక అద్భుతం. దాని అన్వేషణ మార్గదర్శక చిత్రాలు లేని ఒంటరి యాత్ర. కవిత్వంలో కూడా దివ్యజ్ఞాన ఘడియలుంటాయి, అవి సుడిగాలి లా సమస్త తర్కాన్ని అణచివేసి, ముందస్తుగా ఊహించిన అన్ని ప్రణాళికలను కుప్పకూలుస్తాయి. ప్రతిభావంతుడైన ప్రతి కవి, కనీసం తమ అత్యుత్తమ ప్రేరణ సమయంలోనైనా, అటువంటి దివ్యజ్ఞానోదయ క్షణా లలోని ఉత్సాహాన్ని, భయాన్ని అనుభవించి ఉంటారు. నేను కూడా ఈ అనుభూతిని పొందాను. ఎవరో నన్ను నిర్దేశించినట్టు అనిపించిన కొన్ని కవితలు రాస్తున్నప్పుడు మాత్రమే కాదు, అయోధ్యలో సూర్యచంద్రుల మధ్య కొలువుదీరి, చిన్నారి రాముడి ఉయ్యాలను ఊపుతున్న సరయూ గాలికి తన స్వరాన్ని వదిలేస్తూ గిరిజాదేవి 'తుమ్రీ'లు ఆలపిం చడం విన్నప్పుడు , భోపాల్, ఢిల్లీలలో కుమార్ గంధర్వ, మల్లికార్జున్ మన్సూర్ లేదా కిషోరి అమోంకర్ గానం చేస్తున్న పారవశ్య క్షణాలలో ఈ అనుభూతి పొందాను. ఆ క్షణాలలో వాస్తవ ప్రపంచం కనుమరుగై, మనం అమీర్ ఖాన్ లేదా ఫయ్యాస్ ఖాన్ కాలానికి, ఆపై కాలానికి రెక్కలు తగిలించుకు ఎగిరిపోతాం. గొప్ప పాశ్చాత్య శాస్త్రీయ సంగీత విద్వాంసులతో పాటు, ఎం.డి. రామనాథన్ 'హిందోల్', మహాలియా జాక్సన్, అరిటా ఫ్రాంక్లిన్‌ల అరుదైన క్షణాలు కూడా నాకు ఈ అనుభూతిని కలిగించాయి. దోస్తోయెవ్స్కీ 'కారమాజోవ్ బ్రదర్స్' , కజాంత్సాకిస్ 'గాడ్స్ పాపర్' చదువుతున్న ప్పుడూ నాకు అదే అనుభూతి కలిగింది. పోలిష్ కవి టాద్యూజ్ రోజ్ విచ్ అంటాడు– కవిత్వం అర్థపావు పదాల పొట్టి మీద గుడ్లుపెట్టడం కాకుండా , నేరుగా సముద్ర గర్భంలో పెట్టాలని. జె. స్వామినాథన్, రంగుల జ్యామితి గురించి మాట్లాడుతూ, త్రిభుజం, దీర్ఘచతురస్రం, వృత్తం అనేవి వర్ణనాతీతమైన అస్పష్టతలోకి తెరుచుకునే రంగుల కిటికీలని వ్యాఖ్యానించారు. గిరిజన కళలో ప్రకృతి, దాని సృష్టి ఒకదాన్నొకటి ఎలా ఆవరించి ఉంటాయో ఆయన చూశారు. ప్రకృతి గురించి యుద్ధం అత్యాచార భాషలో మాట్లాడి మనిషి, భూమి వినాశనానికి దారితీసే మానవకేంద్రిత పాశ్చాత్య ఆలోచన నుండి మనల్ని మనం విముక్తి చేసుకోవ డానికి, ఈ నాటి ఏ కళకైనా ఈ పరస్పర సంబంధం కీలకమైనదే.

నా కవిత్వంలోని ప్రేరణా శక్తిని ఆ పరిమితమైన పదంతో వర్ణించాలనుకుంటే, నా నిబద్ధత ప్రధానంగా నైతికమైనది – న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, ప్రేమ అన్ని జీవరాశుల పట్ల గౌరవం వంటి విలువలకు కట్టుబడి ఉండటం. మార్కెట్ విలువలు పాలిస్తున్న, మైఖేల్ హార్డ్, ఆంటోనియో నెగ్రి 'సామ్రాజ్యం' అని పిలిచే శక్తులచే అంతకంతకూ హింసాత్మకంగా వలసరాజ్యంగా మారుతున్న ప్రపంచంలో ఇవి మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. మన దేశంలో ఇప్పుడు జరుగుతున్నట్లుగా, మతపాలన, జాతీయవాద, నిరంకుశ శక్తులతో కలిసినప్పుడు అది ప్రజాస్వామ్యానికి మరింత తీవ్రమైన ప్రమాదంగా మారుతుంది. నేను నా సామాజిక, పర్యావరణ ఆందోళనలను ఎప్పటికప్పుడు లేవనెత్తుతూనే, సహజాతాలు, అస్తిత్వం, స్వేచ్ఛ, ప్రకృతి, సంబంధాలు, విశ్వ రహస్యాలు లేదా మరణం వంటి లోతైన అస్తిత్వ ప్రశ్నలను అడగడం మానలేదు. పవిత్రమైనదానికి, లౌకికమైనదానికి మధ్య నాకు ఎలాంటి వైరుధ్యం కనిపించదు; నేను మతప్రసక్తి లేకుండానే ఆధ్యాత్మికత సాధించగలను. ఇది నేను మన సాధువులు, సూఫీ కవులు, సంస్కర్తలైన కబీర్, గాంధీల నుండి నేర్చుకున్నాను. వారు అన్ని రకాల అధికార శ్రేణులకు వ్యతిరేకంగా పోరాడారు, అధికారాన్ని దాని విభిన్న రూపాల్లో సవాలు చేశారు, ఆచరణలో ఉన్న మతం తాలూకు అనవసరమైన బాహ్య రూపాలను ప్రశ్నించారు. ఒక కవికి కవిత్వం తప్ప మరే మతం అవసరం లేదు. విస్లావా షింబోర్స్కా చెప్పినట్లుగా, కవి తన సామర్థ్యం రూపం కోసం కావలసినది, కట్టుకథల ముసుగుల వెనుక, మూసిన తలుపుల వెనుక పూర్తి ఏకాంతంలో ఎదురుచూసే ఖాళీ తెల్ల కాగితం తప్ప, మరేదీ కవిత్వాన్ని భయపెట్టలేదు. ఆత్మ మాట్లాడటం మానేసిన మనిషి పచ్చని ఆకులు, జలపాతాల భాషను అర్థం చేసుకోలేని ప్రపంచంలో ఊపిరాడనీయని నిశ్శబ్దానికే నేను భయపడతాను. విశ్వం పవిత్రతను కోల్పోయి, చెడును ఎదురుప్రశ్నించకుండా రాజ్యమేలే రోజు, మానవజాతి తన ఆత్మహత్యా ప్రవృత్తితో అంతరించిపోడం చూసే రోజు జీవితంలో రాకూడదని, చూసేందుకు నేను బ్రతికి ఉండకూడదని నా కోరిక. ఈ గొప్ప సమ్మానానికి నన్ను ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులకు, గర్వపడవలసిన ఆ మహనీయ కవిగారి కుటుంబానికి, మలయాళం, ఆంగ్లం తెలుగు భాషలలోని నా పాఠకులకు, ఇంకా నిర్భయంగా, పూర్తి చిత్తశుద్ధితో నా కళాసాధనకు నన్ను నిరంతరం ప్రేరేపిస్తున్న వారందరికీ నా ధన్యవాదాలు. ●



విశ్వంభర పురస్కారం, 'డాక్టర్ సి. నారాయణ రెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం' అనేది సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన వారికి హైదరాబాద్‌లోని సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్ ద్వారా ఏటా అందించే ఒక ప్రముఖ భారతీయ సాహిత్య పురస్కారం. ఇందులో 5 లక్షల నగదు బహుమతి, జ్ఞాపిక, శాలువా, ప్రశంసా పత్రం ఉంటాయి.

జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత, దివంగత తెలుగు కవి డాక్టర్ సి. నారాయణ రెడ్డి గౌరవార్థం ప్రతి సంవత్సరం జూలై 29 ఆయన జయంతి వేడుకల సందర్భంగా ఇచ్చే పురస్కారం.

### ఇటీవలి గ్రహీతలు:

నీలిమ్ కుమార్ (2025 – అస్సామీ కవి),

శివశంకరి (2024 – తమిళ రచయిత్రి),

జావేద్ అక్తర్ (2023 – హిందీ గీత రచయిత/రచయిత),

ప్రతిభా రాయ్ (2022 – ఒడియా రచయిత్రి),

చంద్రశేఖర కంబార (2019 – కన్నడ కవి).


ఈ సంవత్సరం 2026 జులై 29న విశ్వంభర స్వీకరించిన కవి టి. సచ్చిదానందన్.

సముచిత కవిని ఎంపిక చేసుకున్న సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్ , ముఖ్యంగా అత్యుత్తమ అభిరుచి గల అధ్యక్షులు శ్రీమతి గంగ , కార్య దర్శి జె. చెన్నయ్య అభినందనీయులు.

### పురస్కార గ్రహీత పరిచయం

సచ్చిదానందన్ సమకాలీన భారతీయ కవులలో విస్తృతంగా అనువదించబడిన వారు కె. సచ్చిదానందన్ . ఆయన రచనల అనువాద సంకలనాలు చైనీస్, ఇంగ్లీష్, ఐరిష్, అరబిక్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, జపనీస్, ఇటాలియన్ తో పాటు అన్ని ప్రధాన భారతీయ భాషలు 21 భాషలలో 31 అనువాద సంకలనాలు ప్రచురించారు. వీటిలో హిందీలో 13 సంకలనాలు , ఆంగ్ల అనువాదంలో స్వయంగా ఆయన రాసుకున్న 11 పుస్తకాలలో 'వైల్ ఐ రైట్: న్యూ అండ్ సెలెక్టెడ్ పోయమ్స్' (హార్పర్– కాలిన్స్, 2011), 'మిస్‌ప్లేస్డ్ ఆబ్జెక్ట్స్ అండ్ అదర్ పోయమ్స్' (సాహిత్య అకాడమీ, ఢిల్లీ, 2013), 'ది మిస్సింగ్ రిబ్' (2016), 'నాట్ ఓన్లీ ది ఓషన్స్' (2018) (పొయెట్రీవాలా, బొంబాయి), 'లెటర్స్ టు ది డెడ్' (కాపర్‌కాయిన్, ఢిల్లీ, 2021), 'ది రివర్ బినీత్ ది రివర్' (రెడ్ రివర్ ప్రెస్, ఢిల్లీ, 2024) ఉన్నాయి. ఆయన మలయాళ మూల కవితల సంకలనం (1965– 2015) ఒక సంపుటిలో, కవితల అనువాదాల సంకలనం నాలుగు సంపుటా లలో (మాతృభూమి బుక్స్) 2016లో వెలువడ్డాయి. ఆయన సంకలిత రచనలు , కవితలు, కథలు, నాటకాలు, బాలల పద్యాలు, యాత్రా కథనాలు, వ్యాసాలు – మాతృభూమి బుక్స్ ద్వారా ముప్పై సంపుటాలుగా వెలువడుతున్నాయి. ఆయన మలయాళం, ఆంగ్లం, హిందీ భాషలలో 40 కవితా సంపుటాలకు, వ్యాస సంపుటాలకు సంపాదకత్వం కూడా వహించారు.

సచ్చిదానందన్ కేరళ భారతీయ భాష మలయాళంలో కవిత్వం, మలయాళం , ఆంగ్లం రెండింటిలోనూ గద్యం రాస్తారు. ఆయనకు 32 కవితా సంకలనాలతో పాటు , 13 ఎంపికలు కాలక్రమానుసార సంకలనాలు, 6 యాత్రా పుస్తకాలు, 3 బాలల పుస్తకాలు, రెండు పూర్తి నిడివి నాటకాలు, నాలుగు ఏకాంక నాటకాలు, 23 విమర్శనాత్మక వ్యాసాల సంకలనాలు (వీటిలో భారతీయ సాహిత్యంపై ఆంగ్లంలో ఆరు పుస్తకాలు ఉన్నాయి), 9 నాటకాలు, అనువాదంలో 27 కవితా సంకలనాలు ఉన్నాయి. ఆయన లండన్, పారిస్, ఫ్రాంక్ ఫర్ట్, బెర్లిన్, సారాయెవో, మాస్కో, మాంట్రియల్, మాడ్రిడ్, సోరియా, సెగోవియా, సెల్జే, వెలెంజే, న్యూయార్క్, వాషింగ్టన్, రోటర్‌డామ్ నుండి బీజింగ్, షాంఘై, డమాస్కస్, దుబాయ్, ఢిల్లీ, బొంబాయి, జైపూర్, గోవా, మద్రాస్,



పురస్కార గ్రహీత: కె సచ్చిదానందన్

భువనేశ్వర్, చండీగఢ్, లాహోర్, కాట్మండు, మెడెలిన్, కారకాస్, లిమా, హవానా వరకు ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక సాహిత్య ఉత్సవాలు , పుస్తక ప్రదర్శనలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు.

ఆయన ఆంగ్ల ప్రొఫెసర్‌గా, ఆ తర్వాత సాహిత్య అకాడమీ (భారత జాతీయ సాహిత్య అకాడమీ) ముఖ్య కార్యనిర్వా హకుడిగా, ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఓపెన్ యూనివర్శిటీలోని స్కూల్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ డైరెక్టర్‌గా, సిమ్లాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీలో నేషనల్ ఫెలోగా పనిచేశారు. ఆయన కేరళ సాహిత్య అకాడమీ ఫెలో, వివిధ రాష్ట్రాలు, దేశాల నుండి 40 సాహిత్య పురస్కారాలను గెలుచుకున్నారు. వాటిలో సాహిత్య అకాడమీ పురస్కారం, కేరళ సాహిత్య అకాడమీ పురస్కారం (కవిత్వం, విమర్శ, యాత్రా కథనం, నాటకం , అనువాదానికి ఐదుసార్లు), ఒరిస్సా నుండి గంగాధర్ మెహర్ జాతీయ పురస్కారం, ఉపేంద్ర భంజ జాతీయ పురస్కారం, మహారాష్ట్ర నుండి కుసుమగ్రాజ్ పురస్కారం, ఆంధ్రప్రదేశ్ నుండి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, కర్ణాటక నుండి కువెంపు పురస్కారం, కేరళలో అత్యున్నత పురస్కారమైన ఎళుతచ్చన్ పురస్కారం, కేరళ నుండి వయలార్ పురస్కారం, ఉల్లూర్ పురస్కారం, కుమారన్ ఆసన్ పురస్కారం, కేసరి నాయనార్ పురస్కారం, కమలా సురయ్య పురస్కారం, దుబాయ్ నుండి కమలా సురయ్య పురస్కారం, ఒమన్, బహ్రెయిన్ నుండి కేరళ సమాజం పురస్కా రాలు, కువైట్ నుండి కదమ్మనిట్ట పురస్కారం, యూఏఈ నుండి ప్రపంచ కవితా శాంతి బహుమతి, పోలాండ్ నుండి భారత్–పోలా ండ్ స్నేహ పతకం, రావెన్నా నుండి డాంటే పతకం, ఇటలీ ప్రభుత్వం నుండి నైట్‌హుడ్ వంటివి ఉన్నాయి. అతను 2011 లో నోబెల్ బహుమ తికి అర్హులైన పది మంది లాడ్‌బ్రోక్ షార్ట్‌లిస్ట్‌లో కూడా ఉన్నాడు.

### స్వప్నాలు, న్యాయం, స్వేచ్ఛల భాషలో

కె. సచ్చిదానందన్ కవిత్వం సరిహద్దులను అధిగమించి, అంతరంగాన్ని, అనంతాన్ని కలగలిపి అల్లుతుంది. ఆయన పద్యాలు ప్రేమ, విరహం, ప్రతిఘటన, ఆశల గురించి మాట్లాడతాయి.. మానవజాతి పోరాటాలకు, అపరిమితమైన ఊహాశక్తి సౌందర్యానికి స్వరం ఇస్తాయి.

### పురస్కారాలు , గౌరవాలు

**1.** కేరళ సాహిత్య అకాడమీ వారి వ్యాస రచనకు 'సి.బి. కుమార్ అవార్డు', కేరళ, 1984.

**2.** ఇండియన్ యూత్ అసోసియేషన్ వారి 'ఉత్తమ ప్రజా పరిశీలకుడు' (Best Public Observer) పురస్కారం, కేరళ, 1986.

**3.** కేరళ సాహిత్య అకాడమీ వారి కవిత్వ పురస్కారం, కేరళ, 1989.

**4.** మధ్యప్రదేశ్ ప్రభుత్వం వారి కవిత్వ అనువాదానికి 'శ్రీకాంత్ వర్మ ఫెలోషిప్', 1990.

**5.** ఒమన్ కల్చరల్ సెంటర్ వారి సమగ్ర సాహిత్య కృషికి పురస్కారం, ఒమన్ (యు.ఎ.ఇ.), 1993.

**6.** 'మహాకవి ఉల్లూర్ అవార్డు' (కవిత్వం), కేరళ, 1996.

7. 'మహాకవి పి. కున్హిరామన్ నాయర్ అవార్డు' (కవిత్వం), కేరళ, 1997.

**8.** భారతీయ భాషా పరిషత్ వారి 'సంవత్సర పురస్కారం' (కవిత్వం), కోల్‌కతా, 1998.

**9.** కేరళ సాహిత్య అకాడమీ వారి నాటక రచనకు పురస్కారం, కేరళ, 1999.

**10.** భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ వారి 'సీనియర్ ఫెలోషిప్', 1999.

**11.** 'గానకృష్టి పురస్కారం' (కవిత్వం), కోల్‌కతా, 2000.

**12.** 'కుమారన్ ఆశన్ అవార్డు' (కవిత్వం), చెన్నై, 2000.

**13.** 'ఓడక్కుజల్ అవార్డు' (కవిత్వం), కేరళ, 2001.

**14.** కేరళ సాహిత్య అకాడమీ వారి యాత్రా రచనకు (Travelogue) పురస్కారం, కేరళ, 2001.

**15.** మానవీయం కల్చరల్ మిషన్ (కేరళ ప్రభుత్వం) వారి 'సాహిత్యం ద్వారా మానవాళికి సేవ' చేసినందుకు జ్ఞాపిక, 2001.

**16.** బహ్రెయిన్ కేరళ సమాజ్ వారి సమగ్ర సాహిత్య కృషికి పురస్కారం, బహ్రెయిన్ (యు.ఎ.ఇ.), 2002.

**17.** సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం (ఒడిశా) వారి 'గంగాధర్ మెహర్ జాతీయ పురస్కారం' (కవిత్వం), 2002.

**18.** పండ లం కేరళ వర్మ కవిత్వ పురస్కారం, కేరళ, 2005.

19. బాపురెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, 2005.

**20.** వయలార్ కవిత్వ పురస్కారం, కేరళ, 2005.

**21.** ఫ్రెండ్‌షిప్ మెడల్ (స్నేహ పురస్కారం), పోలాండ్ ప్రభుత్వం, 2005.

**22.** 'సాహిత్యశ్రీ' బిరుదు, హిందీ సమ్మేళన్, ఢిల్లీ, 2006.

**23.** నైట్‌హుడ్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మెరిట్, ఇటలీ ప్రభుత్వం, 2006.

**24.** డాంటే మెడల్, రావెన్నా, ఇటలీ, 2006.

**25.** శ్రీ కేరళ వర్మ సాహిత్య పురస్కారం, 2006.

**26.** కె. కుట్టికృష్ణన్ స్మారక కవిత్వ పురస్కారం, కేరళ, 2007.

**27.** సుబ్రహ్మణ్య షెనోయ్ స్మారక పురస్కారం (సమగ్ర సాహిత్య కృషికి), 2008.

**28.** కడమ్మనిట్ట రామకృష్ణన్ పురస్కారం, కువైట్, 2009.

**29.** ఎన్. టి. రామారావు జాతీయ సాహిత్య పురస్కారం, హైదరాబాద్, 2009.

**30.** తులనాత్మక సాహిత్యం (Comparative Literature) కోసం బిర్లా ఫెలోషిప్, ఢిల్లీ, 2009.

**31.** పద్మప్రభ పురస్కారం, కేరళ, 2009.

**32.** అనువాదానికి కేరళ సాహిత్య అకాడమీ పురస్కారం, కేరళ, 2010.

**33.** సాహిత్య విమర్శకు సి. పి. మీనన్ పురస్కారం, కేరళ, 2010.

**34.** ఫెలో, కేరళ సాహిత్య అకాడమీ, కేరళ, 2011.

**35.** నోబెల్ బహుమతికి ఎంపికయ్యే అవకాశం ఉన్న మొదటి పది పేర్ల జాబితాలో ( Ladbroke సైట్ ద్వారా) పేరు చేర్చబడింది.

**36.** కుసుమాగ్రజ్ జాతీయ కవిత్వ పురస్కారం, YBCM ఓపెన్ యూనివర్సిటీ, నాసిక్, మహారాష్ట్ర, 2012.

**37.** గ్రీన్ ఇండియా ఎక్సలెన్స్ అవార్డ్ (సాహిత్య విభాగం), 2012.

**38.** మలయాళ సాహిత్యానికి సాహిత్య అకాడమీ పురస్కారం, 2012. 39. కమలా సురయ్య అవార్డు, దుబాయ్, 2013.

**40.** కవిత్వానికి కువెంపు జాతీయ పురస్కారం, 2014.

**41.** సమగ్ర కృషికి కేరళ సాహిత్య పరిషత్ అవార్డు, 2014.

**42.** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావెన్‌కోర్ గోల్డెన్ అవార్డు, 2014.

**43.** మనాపురం వి.సి. పద్మనాభన్ స్మారక పురస్కారం, 2014.

44. 'మలయాళం' కవితకు ముత్తత్ వర్కీ స్మారక పురస్కారం, 2015.

**45.** శాంతి కోసం కవిత్వానికి మహమ్మద్ బిన్ రషీద్ అంతర్జాతీయ పురస్కారం, దుబాయ్, యు.ఎ.ఇ., 2016.

**46.** సమగ్ర కృషికి వి. అరవిందాక్షన్ స్మారక పురస్కారం, 2016.

**47.** కవిత్వానికి కాన్హంగాడ్ కావ్యవేది అవార్డు, 2016.

**48.** సమగ్ర కృషికి కమలా సురయ్య అవార్డు, 2017.

**49.** సమగ్ర కృషికి వెంగాయిల్ కున్హిరామన్ నాయనార్ కేసరి అవార్డు, 2017.

50. సాహిత్యం మరియు సమాజానికి చేసిన కృషికి పి. గోవింద పిళ్ళై అవార్డు, 2017.

**51.** సమగ్ర సాహిత్య కృషికి ఎజుత్తచ్చన్ అవార్డు, 2017.

**52.** ఇ.కె. సాహిత్య అనువాదానికి దివాకరన్ పొట్టి అవార్డు, 2018.

**53.** కవిసామ్రాట్ ఉపేంద్ర భంజా జాతీయ పురస్కారం, ఒరిస్సా 2018.

**54.** తుంచత్ ఎజుహచన్ అవార్డు, కేరళ ప్రభుత్వం, 2018

**55.** చిరంతన కళాసమితి అవార్డు, దుబాయ్, UAE, 2018

**56.** అనువాదానికి ఇ ఐ దివాకరన్ పొట్టి అవార్డు, 2018

**57.** పి. గోవింద పిళ్లై ఫౌండేషన్ అవార్డు, 2018

**58.** నవమలయాళి కల్చరల్ అవార్డు, కేరళ, 2019

**59.** కలియచ్చన్ కవిత్వ పురస్కారం, కేరళ, 2019

**60.** సాహిత్యానికి ఖూఈ అవార్డు, కేరళ, 2019

**61.** టాటా కవి గ్రహీత అవార్డు, బొంబాయి, 2019

**62.** మాతృభూమి లిటరేచర్ అవార్డు, 2020

(మిగతా 4 పేజీలో....)

(3వ పేజీ తరువాయి....)

63. ONV మెమోరియల్ అవార్డు, కేరళ విశ్వవిద్యాలయం, 2020
64. యువకళాసాహితి అవార్డు, 2021
65. కొల్లం లైబ్రరీ కౌన్సిల్ అవార్డు, 2021
66. స్టేట్ లైబ్రరీ కౌన్సిల్ అవార్డు, 2021
67. కతిరూర్ కో-ఆప్ బ్యాంక్ నుండి V V K అవార్డు, 2021
68. I V దాస్ అవార్డు, 2022
69. బషీర్ అవార్డు, 2022
70. కవిత్వానికి దేశాభిమాని అవార్డు, 2022
71. కుంజికుట్టన్ థంపురాన్ అవార్డు, 2022
72. కన్హయ్యాహ్లాల్ సేథియా అవార్డు, జైపూర్, 2022
73. సంవత్సరపు ఉత్తమ కవితకు మీమ్ అవార్డు , కాలికట్, 2023
74. డాక్టర్ కె ఎ భాస్కరన్ మెమోరియల్ భాస్కరేయం అవార్డు, 2024
75. కవిత్వానికి టి. ఉబైద్ అవార్డు, 2024
76. కవి టి. ఉబైద్ మెమోరియల్ అవార్డు, 2025
77. KPTA గురుశ్రేష్ట పురస్కారం, కేరళ 2025
78. యువకళసాహితి అవార్డు, కొల్లం,2026
79. కుమరన్ అసన్ 150వ జన్మదిన వార్షికోత్సవ ప్రత్యేక అవార్డు, 2026
80. సి. నారాయణ రెడ్డి జాతీయ అవార్డు, హైదరాబాద్, ఆంధ్ర, 2026
81. బాలల కవిత్వానికి బాలసాహిత్య అకాడమీ అవార్డు, కేరళ 2026

## కవిగా జాతీయ మరియు అంతర్జాతీయ వేదికలపై ప్రాతినిధ్యం

1. వాల్మీకి ప్రపంచ కవితాత్సవం, న్యూఢిల్లీ, 1985
2. సరజెవో కవితా దినోత్సవాలు, యుగోస్లేవియా, 1985
3. 'కవిభారతి' – జాతీయ కవుల సమ్మేళనం, భోపాల్, 1987
4. జాతీయ కవుల సమ్మేళనం, హైదరాబాద్, 1988
5. 'కవితా ఆసియా' – ఆసియా కవితాత్సవం, భోపాల్, 1988
6. యు.ఎస్.ఎస్.ఆర్.(సోవియట్ యూనియన్)లో భారతోత్సవం, మాస్కో- రీగా, 1988
7. సార్క్ (SAARC) కవుల సమ్మేళనం, కలకత్తా, 1992
8. కవితా పఠనం మరియు ఉపన్యాస పర్యటన, ఒమన్, 1993
9. చైనాలో భారతోత్సవం, బీజింగ్, 1994
10. ఏక కవి కవితా పఠనం, భారత్ భవన్, భోపాల్, 1994 11. 'అబ్రిట్టిలోకే' కవితా ఉత్సవం, కలకత్తా, 1994.
12. అంతర్జాతీయ కవితా ద్వివార్షికోత్సవం (Biennale), ఇవ్రీ, ఫ్రాన్స్, 1997.
13. రచయితల పరస్పర మార్పిడి కార్యక్రమం, స్వీడన్, 1997.
14. కవితా పఠనం మరియు ఉపన్యాస పర్యటన, అమెరికా (జ.రా.ం.), 1997.
15. రచయితల పరస్పర మార్పిడి కార్యక్రమం, ఇటలీ, 1999.
16. కవితా పఠనం మరియు ఉపన్యాస పర్యటన, దుబాయ్, షార్జా, 2001.
17. కవితా పఠనం మరియు ఉపన్యాస పర్యటన, బహ్రెయిన్, 2002.
18. భారత రాయబారి నివాసంలో కవితా పఠనం, రోమ్, 2002.
19. 'ప్రెంటెంప్స్ డెస్ పోయెట్స్' (Prentemps des Poetes), పారిస్, లా రోచెల్, మార్సెయిల్స్, క్లెర్మాంట్-ఫెరాండ్, ఫ్రాన్స్, 2003.
20. జాతీయ కవుల సమ్మేళనం, సూరత్, 2003.
21. బహుభాషా కవుల సమ్మేళనం, బెంగళూరు, 2003.
22. కవితా పఠనం మరియు ఉపన్యాసం, చండీగఢ్ సాహిత్య అకాడమీ, చండీగఢ్, 2003.
23. జాతీయ కవుల సమ్మేళనం, కోల్‌కతా, 2003.
24. జాతీయ కవుల సమ్మేళనం, గోవా, 2003.
25. జాతీయ కవుల సమ్మేళనం, ఢిల్లీ, 2004.
26. కుమారన్ ఆశన్ స్మారక జాతీయ కవుల సమ్మేళనం, తిరువనంతపురం, 2004.
27. లటకై మరియు అలెప్పో విశ్వవిద్యాలయాలలో కవితా పఠనాలు, సిరియా, 2004.
28. కావ్యభారతి, జాతీయ కవుల సమ్మేళనం, ముంబై, 2004.
29. జాతీయ ముషాయిరా, గోవా, 2004.
30. ముఖాముఖి కార్యక్రమం: పంజాబీ సాహిత్య అకాడమీ, లూధియానా, 2004.
31. కవితా పఠనం, లాహోర్, పాకిస్థాన్, 2004.
32. కవిభారతి, భారతీయ త్రివార్షిక కవితా ఉత్సవం (ఒతీతివనినిజీశ్రీవ), భోపాల్, 2005.
33. బెర్లిన్ సాహిత్య ఉత్సవం, జర్మనీ, 2005.
34. లీప్‌జిగ్ పుస్తక ప్రదర్శన, జర్మనీ, 2006.
35. అబుదాబి పుస్తక ప్రదర్శన, యు.ఎ.ఇ., 2006.
36. ఫ్రాంక్‌ఫర్ట్ పుస్తక ప్రదర్శన, జర్మనీ, 2005, 2006.
37. 'హౌస్ ఆఫ్ లిటరేచర్ అండ్ లాంగ్వేజెస్'లో పఠన కార్యక్రమం,బాన్,2005, 2006.
38. పారిస్ పుస్తక ప్రదర్శన, 2007.
39. సార్క్ (SAARC) రచయితల సమావేశం, ఢిల్లీ, 2007.
40. జైపూర్ సాహిత్య ఉత్సవం, జైపూర్, 2008.
41. ఇండో-అరబ్ సాహిత్య ఉత్సవం, అబుదాబి, 2008.
42. ప్రకృతి కవితా ఉత్సవం, చెన్నై, 2008.
43. ఆసియా పసిఫిక్ సాహిత్య సదస్సు, ఢిల్లీ, 2008.
44. కోవలం అంతర్జాతీయ సాహిత్య ఉత్సవం, తిరువనంతపురం, 2008.
45. కృత్య అంతర్జాతీయ కవితా ఉత్సవం, చండీగఢ్, 2008.
46. ఢిల్లీ అంతర్జాతీయ సాహిత్య ఉత్సవం, 2008.
47. జైపూర్ అంతర్జాతీయ సాహిత్య ఉత్సవం, 2009, 2010, 2011.
48. లండన్ పుస్తక ప్రదర్శన, 2009.
49. కెల్లాగ్ కళాశాలలో పఠన కార్యక్రమం, ఆక్స్‌ఫర్డ్, 2009.
50. మాస్కో పుస్తక ప్రదర్శన (2009).
51. అరబ్ అనువాదకుడు షిహాబ్ ఘనేమ్‌తో కలిసి దుబాయ్‌లో పఠన కార్యక్రమం, 2009.
52. సింఘువా విశ్వవిద్యాలయంలో పఠన కార్యక్రమం, బీజింగ్, 2010.
53. బ్లూ మెట్రోపోలిస్ సాహిత్య ఉత్సవం, మాంట్రియల్, 2011.
54. హే (Hay) ఉత్సవం, తిరువనంతపురం, 2011.
55. వేల్స్ అంతర్జాతీయ కవితా సమావేశం, వేల్స్, 2011.
56. 'పోయెట్రీ కనెక్షన్స్' పఠన కార్యక్రమాలు, మాంచెస్టర్, 2011.
57. హే ఉత్సవం కవితా వేడుక (Poetry Gala), తిరువనంతపురం, 2011.
58. సమన్వయ సాహిత్యోత్సవం, ఢిల్లీ, 2011.
59. కృత్య అంతర్జాతీయ కవితోత్సవం, తిరువనంతపురం, 2011.
60. రోటర్‌డామ్ కవితోత్సవం, నెదర్లాండ్స్, 2012.
61. గౌహతి పుస్తక ప్రదర్శన మరియు సాహిత్యోత్సవం, ముఖ్య అతిథి, 2012.
62. మెడెల్లిన్ కవితోత్సవం, కొలంబియా, 2013.
63. లాటిన్ అమెరికాలో 'ఫెస్టివల్ ఆఫ్ ఇండియా' (భారతీయ ఉత్సవం), 2013.
64. కృత్య అంతర్జాతీయ కవితోత్సవం, 2013.
65. షార్జా పుస్తక ప్రదర్శన, 2013.
66. ఢిల్లీ అంతర్జాతీయ కళా మరియు సాహిత్యోత్సవం, 2014.
67. ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్ కవితోత్సవం, ఢిల్లీ, 2014.
68. శబ్ద: ప్రపంచ కవితోత్సవం, ఢిల్లీ, 2014.
69. విలెనికా సాహిత్యోత్సవం, స్లోవేనియా, 2014.
70. కవితా పఠన కార్యక్రమాలు, మాడ్రిడ్, అవిలా, సోరియా – స్పెయిన్, 2015.
71. విలెనికా కవితోత్సవం, 2015.
72. షార్జా అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన, 2015, 16.
73. బ్రిక్స్ (BRICS) సాహిత్య సదస్సు, బీజింగ్, 2017.

## సమగ్ర సాహిత్య కృషికి లభించిన పురస్కారాలు

1. నాలప్పాట్ నారాయణ మీనన్ పురస్కారం, కేరళ (2025)
2. బయో (ఃజీతినీ) ప్రపంచ కవితా పురస్కారం, సిడ్నీ (2025)
3. మయూఖం సాహిత్య రత్నం పురస్కారం, కేరళ (2025)



పురస్కార గ్రహీత – కె. సచ్చిదానందం
ప్రసంగంకు తెలుగు అనువాదం
-స్వాతి శ్రీపాద



# సినారె 'ప్ర' పంచపదులు' వ్యక్తిత్వవికాస ప్రవాహికలు

poetry is the rhythmical creation of beauty in words"...... Edgar allan poe.

బుద్ధికాలుష్యాన్ని శుద్ధిపరచే సాధనమే కవిత్వం. సామాన్యునితో స్నేహం చేయగలిగేదే కవిత్వం, అది ఏ సాహిత్య ప్రక్రియ ఐనా సరే. నిఘంటువులోకి లాక్కువెళ్ళే కఠిన పదాలను, అర్థం కాని గజిబిజి అల్లికలనుప్రదర్శించేది కవిత్వం కాదు. అది పరిష్కరించడానికి పనికొచ్చే 'ఫజిల్' మాత్రమే. అందుకే నేడవి సామాన్యుని హృదయం లో గాక, సాహిత్య ప్రదర్శనశాలల లో భద్రపరచడమైనది. వేమన, సుమతికారుని పద్యం నేటికీ సమాజంలో తిరగటానికి కారణం, ప్రజల మధ్యలో కదిలే భాషను ఉపయోగించినందుకే. అలాంటి శైలికి ఆయువుపట్టు 'జ్ఞానపీఠ్ అవార్డు 'గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి. అవి గేయకావ్యాలైనా, ప్రబంధాలైనా, గజళ్ళైనా, వచన కవితలైనా సమకాలీన సమాజ వైఖిరికి అద్దం పట్టేవిగా వుండడమే వారి వినూత్నత. సామాన్య పాఠకుడే వారి 'గురి'. సినారె సాహిత్యానికి ప్రభావితం కాని కవులు గాని, పాఠకులుగాని, పండితులుగానీ సాహితీ రంగములో లేరనే చెప్పవచ్చును. అందులో మనం ప్రస్తుతం ప్రస్థావించవలసిన విశిష్ట ప్రక్రియే వారి 'ప్రపంచ పదులు'. ఇందులోని ఐదు పాదాలలో మూడవ పాదం 'ముగింపు', మొదటి రెండు పాదాలలో ' విషయ ప్రస్థావన ' చివరి రెండు పాదాలలో 'విషయ విస్తరణ '. అంత్యప్రాసలు 1,2,4,5 పాదలలోనూ ఒకే పదం ఉపయోగించడం ఒక నూతన ప్రయోగం. మూడవ పాదంలో ప్రాస వుండదు కేవలం ముగింపు మాత్రమే. ఇలా కొనసాగే ఈ ప్రక్రియ లోని 'కంటెంట్' ను పరిశీలించినట్లయితే అతి సరళమైన శైలిలో అన్ని భావాలూ ప్రస్ఫుటంగా పలుకుతాయి. సమకాలీన సమాజపు సమస్యలు, మనిషి దరాగతాలు, దుర్నీతులు అక్షరీకరించడం ఒక ఎత్తు, వాటి నుండి బయటపడే నివారణోపాయాన్ని విశదీకరించడం ఒక ఎత్తు. సినారె సాహిత్యం లో సహజంగా కనిపించే గేయ లక్షణం, విభిన్నమైన ప్రాస, అతి క్లిష్టమైన అభివ్యక్తిని అత్యంత సరళ భాషలో వ్యక్తపరచడం సినారెకి మాత్రమే సుసాధ్యం. ప్రపంచపదులు సారాంశాన్ని వివరిస్తూ సినారె స్వయంగా ' కలిమికి సాఫల్యం నలుగురికి దక్కినపుడే / పదవి సాఫల్యం అది ప్రజల మనసుకు ఎక్కినపుడే. అంటూ మానవతా వాదాన్ని బలపరుస్తారు. ప్రపంచపదులలో రుబాయి సొగసు, లయాత్మకతను ఐదు పాదాలలో జొప్పించి వాటికి మధురిమలు అద్దారని అంటారు విజ్ఞులు. పద్యంగా గాని, పూర్తి స్థాయి గేయంగా గాని కాకుండా లఘు కవితా రూపాలుగా సృజించి, వీటిలోని భావ సాంద్రత, విషయ వ్యక్తీకరణ, ప్రకృతి వర్ణణలు, శబ్ద సంయోగములు అపూర్వమైనవని

సాహితీ వర్గాల ప్రశంసలను అందుకున్నవి. ప్రపంచపదులు తెలుగు సాహిత్యంలో ఒక సరికొత్త ప్రక్రియ అని, ఇది హాలుని గాథాసప్తశతి వలే ఒక మైలురాయి అని పండితుల అభిప్రాయం. ' సినారె కవిత్వం మట్టిని పసిడి చేస్తుంది, ప్రాణాన్ని అమృతం చేస్తుంది. ఆయన కలం నుండి జాలువారిన ప్రతి అక్షరం ఒక మధురమైన గీతం' అన్నారు ప్రముఖ విమర్శకులు డాక్టర్. ఆచార్య యన్. యస్. రాజు. ప్రపంచపదులు లో లౌకిక జీవనం, మానవసంబంధాలు, సామాజిక స్పృహ, ప్రకృతి వర్ణనలు ఇతివత్తాలు. మచ్చుకు అందులోని పద్యములను కొన్ని ఉదహరించు కొందాం... **' ఎన్ని మెట్లు ఎక్కావని కాదు, ఎంత ఎత్తు ఎదిగావనీ/ ఎన్ని మునకలేశావని కాదు, ఎంత లోతు చూశావనీ/ గమనం సార్థకమవుతుంది నీ గమ్యాన్ని చేరినపుడే / ఎన్ని సభలు తిరిగావని కాదు, ఎంత బుద్ధి పెంచావనీ/ ఎన్ని కృతులు చదివావని కాదు, ఎంత సిద్ధి పొం దావనీ/...** అహంభావంతో అన్నీ నాకే తెలుసని ఘీంకరించేవారికి, ఈ పద్యం ఒక కొరడా పెట్టు కాదా! ఇలాంటి పద్యాలు ఈ గ్రంథంలో కోకొల్లలు అనేదాని కంటే అన్నీఅవే అనడం సమంజసం. 'గమ్యం చేరేవరకూ, గమనం సార్థకం కాదన్న ' సత్యాన్ని నాల్గు పదాల్లోనే చెప్పడం భగవద్గీత సారాంశం. నాటి భారతంలోని పాత్రలు నేటి సమాజంలో కూడా సంచరించు చున్నాయని పేర్లు చెప్పకుండా వారి స్వభావాలను తెలిపి మన నోటితోనే వారి పేర్లు చెప్పించిన వైనం అందరికీ అసాధ్యం. ఈ పద్యం లో ఇలా అన్నారు సినారె... ' నిండు సభలో నీతులొలిచే దండిమగల ఉన్నారు నేడూ/ మర్మమెరిగీ బొంకులాడే ధర్మసుతులున్నారు నేడూ/ నాటి భారత గాథ లేదా నేటికీ మన కళ్ళముందే/ పాపసంతతి కొమ్ముకాచే ప్రభువులూ ఉన్నారు నేడూ/ పరమ శిష్యుల ప్రతిభ నరికే గురువులూ ఉన్నారు నేడూ.. ఇంకో పద్యం లో ఇలా అంటారు....

'మింటికుందో యేమొగాని కంటికేదీ పరిమితి?/ దిక్కు కుందో యేమొగాని మొక్కుకేదీ పరిమితి?/ అన్నిటికీ గిరిగీసి చూపే ఆ ప్రయత్నం వ్యర్థమే/ భాషకుందో యేమొగాని ధ్యాసకేదీ పరిమితి?/ శ్వాసకుందో యేమొగాని ఆశకేదీ పరిమితి? /. ఈ కవిత కు విశ్లేషణ అవసరమా? అంటే ఖచ్చితంగా అవసరమే, ఎందుకంటే ఈ రోజుల్లో ఎంతోమంది వ్యక్తిత్వ వికాసమని, విజయానికి వందమెట్లు అని, ఆనందానికి అడ్డ దారులనీ ఎన్నో తరగతులను నడుపుతూ లక్షలు దండుకుంటున్నారు. వారిలో స్వామీజీలు, ప్రవచనకారులు వున్నారు. వారు ఎంతో మంది కాలాన్ని, ధనాన్ని దోచుకుంటున్నారు. కావలసిన కృషి చేయకుండా పరిమితులను సృష్టించుకొని అపజయాన్ని రుచి చూస్తున్నారు. శ్రమకు హద్దులెక్కడివని ఎంత చక్కగా సరళంగా ప్రశ్నించారో సినారె!... కీర్తి కోసం ఏమి చేయడానికైనా సిద్ధపడే ఈ రోజుల్లో, నిజమైన కీర్తి ఉనికి ఎలా వుంటుందో, అది ఎలా అయాచితం గా వస్తుందో తన వినూత్న శైలిలో ఇలా అంటారు సినారె... ' నీడలాగా నీ వెంట పడేదే నిక్కమైన కీర్తి/ మృత్యుబాహువుల కందలేనిదే నిత్యమైన కీర్తి/ డప్పులు డబ్బులు కొనితెచ్చే ఆ మెప్పులకేం గాని-/ రొచ్చు ఊబిలో ఉబికొచ్చేదే స్వచ్ఛమైన కీర్తి/ చిచ్చు అంచుపై నడిచొచ్చేదే మచ్చలేని కీర్తి../ పురస్కారాల కోసం ప్రస్తుతం జరుగుతున్న ఈ డప్పు, డబ్బుల 'తంతు' ను బయటపెడుతూ , నిజమైన కీర్తి నీ అర్హత వెంట ఎలా పడుతుందో వివరించారు. ఇంకో పద్యం లో 'మౌనం ' ఒక బాణం గాను, ఒక నయనం గానే కాక, ఒక జ్ఞానంగానూ , ఒక విస్ఫోటనం గానూ చమత్కరించడం ఒక్క సినారె కే చెల్లుతుంది ఇలా... ' మాటల కోటలు కూల్చే బాణం మౌనం/ మనిషికి మననం నేర్పే జ్ఞానం మౌనం/ మౌనం లోతులు మాటలకందవు లేవోయ్/ మగతల పొరలను చీల్చే మథనం మౌనం/ మనసుకు వెలుగును చూపే నయనం మౌనం/....

'శ్రమ'శక్తిని ఇంతకు ముందు ఎందరో కమ్యూనిస్టులూ, కవులు, గేయరచయితలూ ఎన్నో రీతులలో ప్రస్థావించారు. కాని అలతి పదాలతో 'శ్రమ ' పదాన్ని వాడకుండా, ఆ భావాన్ని అంతర్వాహికంగా నాల్గు పాదాలలోనే నడిపించిన తీరు ' అపూర్వం'... ! ఇదే ఆ పద్యం ' కరగనిదే కొవ్వొత్తికి కాంతి ఎలా పుడుతుంది?/ చెక్కనిదే శిల కడుపున శిల్పమెలా పుడుతుంది?/ ఫలితం అందేది తీవ్రపరిణామంలోనె సుమా-/ మరగనిదే నీరు ఎలా మబ్బు రూపుకడుతుంది?/ నలగనిదే అడుగు ఎలా నటన రక్తి కడుతుంది?/.. ఇలా ప్రతి పద్యం ఉదహరించతగినదే. అన్ని అవే? అందుకే చివరిగా...' కలవరపడి వెనుదిరిగితె కాలం ఎగబడుతుంది/ కదను తొక్కి. చెలరేగితె కాలం భయపడుతుంది./ కర్మయోగి ఏనాడూ కాలాధీనుడు కాదు--/ కనురెప్పలు మూతపడితె కాలం జోకొడుతుంది/ కంఠమెత్తి తిరగబడితె కాలం జేకొడుతుంది/... కాలం మనిషిని ఎలా లొంగదీసు కొం టుందో హెచ్చరిస్తూనే, అదే మనిషి కాలాన్ని ఎలా లొంగదీసుకోవాలో నేర్పుతున్న ఈ వైనాన్ని 'కర్మయోగి ఏనాడూ కాలాధీనుడు కాదు ' అంటూ కాలాన్ని కూడా హెచ్చరించారు సినారె సీరియస్ గా. చిట్ట చివరిగా ఒక అధ్భుతమైన ఫద్యం.... **'ఒరిగిపడిన జాతికి వెనుచరుపులీ ప్రపంచ పదులు/ మరుగుపడిన నీతికి కనువెరుపులీ ప్రపంచపదులు/చేదో తీపో మధించి చెప్పాడు సుమా సినారె-/ కునికే అడుగులకు మేలుకొలుపులీ ప్రపంచప దులు/ మారే విలువలకు దారిమలుపులీ ప్రపంచపదులు/... జాతికి, నీతికీ విలువలకు దారి**

మలుపులని ఎంతో గొప్పగా ప్రబోధించారిక్కడ సినారె. వ్య క్తిత్వ వికాసానికి నిక్కచ్చిగా దోహదపడే ఈ ' ప్ర పంచప దులు' తెలుగువారికే గాక ప్రపంచమంతా చదవడానికి ఆంగ్లం లోనికి అనువదించారు గోవిందరాజు రామక్రిష్ణా రావు. ఇదే కావ్యాన్ని డాక్టర్ రవ్వా శ్రీ హరి 'ప్రపంచపది' పేరుతో సంస్క్రతానువాదం చేశారు. ఇలా అనేక ప్రాంతీయ భాషానువా దాలకు నోచుకొన్న ప్రపంచపదులు దేశం లోనే గాక అంతర్జాయఖ్యాతినార్జించింది అనడం సమంజసం. ఇంకొక విషయం ఏమంటే చదివిన ప్రతి పాఠకున్నీ ఆలోచిం పజేసి, అబ్బురపరచే నైపుణ్యం సినారె విరచిత 'ప్రపంచపదులు' కు పుష్కలంగా వుంది.

**సినారె సాహిత్యం**
**ఒక మేలుకొలుపు.**
**మానవత్వం పరిమళానికి**
**మేలు పలుకు.**

(సినారె జయంతి
జూలై 29 సందర్భంగా)



**-మాయకుంట్ల నారాయణరెడ్డి**
99896 86603



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ఈ వారం వచన కవితల వర్క్ షాపులో "ప్రేమ" గురించి విజేతల కవితలు చదవండి. –సంపాదకులు

-డా॥రావి రంగారావు
9247581825

## ప్రేమ బంధం

ప్రేమ
చూపులు కలిసి
నవ్వులు మెరిసి
మౌన భాషలో ఎన్నో ఊసులు,
కంటి భాషలో ఎన్నో సైగలు,
కళ్లతో మొదలై
మనసుల దాకా చేరుతుంది...
అప్పటిదాకా అసలే తెలియదు
కానీ
పరిచయం ఓ పరిమళమై
తలపులను హత్తుకుపోయింది...
ప్రణయం ఓ పరవశంలా
గుండెలను అల్లుకుపోయింది...
ప్రేమ
ఊహల్లో విహరింపజేస్తుంది,
ఊపిరిగా జీవింపజేస్తుంది,
ఆశల పల్లకిలో తీసుకెళ్లి
ఆనందపు లోకాన్ని చూపిస్తుంది...
తడవ కోసారి తీరాన్ని తాకిపోయే అలల్లా
తపించే ఆలోచనలు పదేపదే గుర్తుచేస్తాయి,
వసంతం అనే కొత్త చీర కట్టుకున్న ప్రకృతి కాంతలా
అనురాగపు వెలుగులో ప్రతిదీ అందంగా కనిపిస్తుంది...
తను, నేను, ప్రేమ
ఒకరు, ఒకరు
ఒకటయ్యే ప్రేమ
రెండు అక్షరాల పదం ప్రేమ
రెండు మనసుల బంధం ప్రేమ...

**-వాసు రాచకొండ**
9676081908

## ప్రేమ

నేనంటే
ఎంత ప్రేమ నీకు...
అడుగుతుంది తను...
నా బాధకు
తన గుండెల్లో కలుక్కుమనే
అమ్మంత ప్రేమ..
నా కాళ్ళలో గుచ్చుకున్న ముల్లును తన నోటితో
జాగ్రత్తగా తీసే నాన్నంత ప్రేమ...
కన్నీరొస్తే కరిగిపోతాడని కన్నయ్యను
కళ్ళలోనే దాచుకున్న రాధమ్మంత ప్రేమ...
పొద్దంతా తన చుట్టూ తిరిగి పొద్దు వాలగానే
తల వాల్చేసే పొద్దుతిరుగు డంత ప్రేమ....
శిశిరంలో అనాధైన చెట్టుకు
చిగురులు తొడిగి
కబురులు చెప్పే వసంత మంత ప్రేమ.....
తనపై ఎన్ని గీతలు గీసినా
నీ రాతను మార్చాలని చూసే
నల్లబల్లంత ప్రేమ...
పడగానే లేపి
నిలబడగానే చప్పట్లుకొట్టి
సంబరపడే మా ఊరంత ప్రేమ....
బ్రహ్మాండాలను భుజాలపై మోసే
భర్తలను తులసి ఆకులతో
తూచగలిగే ఇల్లాలంత ప్రేమ...
నల్లటి మేఘాలకు రంగులద్ది
హరివిల్లుగా మార్చే
ఆకాశ మంత ప్రేమ...
నువ్వంటే ఇంత ప్రేమ అంటూ
చెప్పాను అక్షరానికి..
అంతే... కవిత్వమై కరిగిపోయింది....

**-శివకుమార్. యెనికేపల్లి**
9989385898

## ప్రేమేంద్ర జాలం

సృష్టి లయకారుని తపో నిష్ఠను
మన్మధుని సాక్షిగా భగ్నం చేసి
సంతోష సంతాపాలకు
ఏకైక కార్య కర్తగా..
పురాణ కాలం నుండి
ప్రణయ రథంపై ప్రయాణిస్తున్న
పట్టు వదలని విక్రమార్కుని
మార్కు ఈ ప్రేమ..!.
అణువుకు అందని అనంతంలా..
అనంతంలో పొసగని అణువులా..
సర్వ జీవుల హృదయాలలో
సందర్భానుసారంగా...
ప్రమోద ప్రమాద
పతాకలను
అనునిమిషం ఎగరేసే
మనో విశ్లేషణా నాయకుని
నోము ఈ ప్రేమ..
మచ్చలేని తనంతో
జాబిలి నైనా
చిలిపిగా
జడిపించగలదీ ప్రేమ...
స్వచ్ఛమైన సూక్ష్మంతో
పాలను కూడా
కలవరపరచగలదీ ప్రేమ..
కుటిల నీతితో
హాలాహలాన్ని
సృష్టించగలదీ ప్రేమ..
ప్రతీకార జ్వాలల్తో
హోరా హోరీ రుధిరం
చిందించ గలదీ ప్రేమ..
నిశ్శబ్ద నినాదాలకు వేధికగా
చావు బ్రతుకుల
స్వర్గ నరకాలకు
విజయ పరాజయ
"వీసా"గా
సమస్త జీవులలో
పరకాయ
ప్రవేశం చేస్తుందీ ప్రేమ..
సరస స్వాగతాలోచనలకు
ప్రణయ మీ ప్రేమ...
సమర చీత్కారాలకు
ప్రళయ మీ ప్రేమ..
మరణమీ ప్రేమ...!
అమరమీ ప్రేమ..!!

**-శ్రీరామ్ మాల్యాద్రి**
9866722484

## నీ ప్రేమ

మనసులో మాటలను
తెలిపేది నీ ప్రేమ,
కళ్ళలో భావాలు
చూపేది నీ ప్రేమ...
చల్లని వేళలో
వెన్నెలను కురిపించి
తనువుపై తాపములె
పెంచేది నీ ప్రేమ..
ముచ్చటగ మాటలను
పెదవిపై పలికించి
దారమై బంధముతో
మెలిగేది నీప్రేమ...
ముద్దుగా మోములో
సిగ్గులను మురిపించి
బ్రతుకులో ప్రశాంతత
ఇచ్చేది నీ ప్రేమ...
కనకమై జీవితాన
వెలుగులను మెరిపించి
భవితపై ఆశలను
నిలిపేది నీ ప్రేమ...

**-శరకణం కనకదుర్గ**
7013895650

## ప్రేమా... ఎక్కడ నీ చిరునామా?

మృత్యువుతో పోరాడి
నీకు జన్మ నిచ్చిన అమ్మలో,
తన జీవితాన్ని ధారపోసి
జీవ మిచ్చిన మీ నాన్నలో,
అమ్మ ఒడిని పంచుకొని
అనురాగం పెంచుకొని
రక్తబంధమై నిలిచిన
నీ తోబుట్టువులలో...
తనువు లెంత దూర మున్నా
తలపులోన నిలుపుకున్న
ప్రియుని పిలుపుల సవ్వడిలో
చెలి కన్నుల మైమరపులలో...
కష్ట సుఖాలు తెలుసుకొని
ఇష్ట సఖులుగా మసలుకొని
మాతృ మూర్తులకు మమత పంచే కన్న బిడ్డల సేవలో...
కాల మెంత వేగ మైనా
దూర మెంత భార మైనా
కొలువుతీరి ఉంటా నేను
కల్మష రహిత హృదయాలలో...
భాషకు అందని లిపిలో,
మధుర భావాల గుళికలో,
మౌన తరంగాల సడిలో,
అనంతుని శబ్ద నాదంలో...
ఎక్కడ, ఎక్కడ అంటూ
నన్ను
అక్కడ,ఇక్కడ వెతకకు...
పుడమిపై ప్రతి అణువూ నేనే,
ఈ ప్రకృతి అంతట నేనే....

**-కృష్ణ భార్గవి పరుచూరి**
9492903760

## ప్రేమ

నదులు పులకించి ప్రవహించి
సాగరంతో సంగమించి చేసే సవ్వడే ప్రేమ...
పున్నమి వెన్నెల చల్లని చూపుల కవ్వింతకు
విరిసిన మల్లెల పరిమళమే ప్రేమ...
నిండైన ఆడవిలో
రెండు కొమ్మల రాపిడి రవ్వల వెలుగే ప్రేమ...
రెండు పాదాలు సరిగమల సవ్వడి చేస్తూ
కలిసి సాగే ప్రయాణమే ప్రేమ...
రెండు చేతులు ముకుళించి మురిపించే సంస్కారమే ప్రేమ...
తేనెటీగలు పువ్వు పువ్వు ముద్దాడి
కురిపించిన మధురమే ప్రేమ...
రవి కిరణం సోకగానే కమలం పులకింతే ప్రేమ...
కౌముది స్పర్శతో విరిసి మురిసే
కలువ భామా కలాపమే ప్రేమ...
గిజిగాడు గువ్వల కోసం ఇంజనీర్ గా కట్టిన
గూడు సౌందర్యమే ప్రేమ...
బహు బంధు బలత్వమే ప్రేమ,
వర్షం తాకని అణువు లేదు, ప్రేమ తాకని తావి లేదు విశ్వంలో...
సృష్టి లయ "లాలసమే" ప్రేమ,
సృష్టిలో ఆకర్షణ వికర్షణ బలమే ప్రేమ,
స్వచ్ఛతకు ప్రతి రూపమే ప్రేమ...

**-పగడాల వెంకటరెడ్డి**
7993422614

## ప్రేమంటే...

మన ప్రేమ మొదలై
ఎన్నేళ్లు అయితేనేం,
అది వేకువజామున
పుడమిని తాకే
వెలుగు కిరణమే...
నిత్యం
వెన్నంటే ఉండే శ్వాసలా
నీవుంటే
నాలో నీవు లేనిదెక్కడా?.
ప్రేమ తాపానికి
వేడెక్కిన పుడమికి
విశ్రాంతి నిస్తూ...
మలి పొద్దయ్ వాలినా...
తొలి పొద్దులో వెలుగురేఖలా
నన్ను పలకరిస్తావు...
ఇదే కదా నువ్వంటే...
యుగ యుగాలుగా
తర తరాలుగా
భూగోళాన్ని చుట్టుముట్టిన
ఆకుపచ్చని తోరణం కదా
ప్రేమంటే.....!

**-గోలి మధు**
9989186883

## న్యూ సిలబస్!

ఇప్పుడు మనందరం వినాలి !పిల్లలు చెబుతున్న మాటల్ని వినాలి
నిన్నటిదాకా ఈ పిల్లలంతా తప్పటడుగులు వేస్తూ
అల్లి బిల్లి పదాలను పలుకుతూ
అమాయకత్వాన్ని పెదాలపై జీవింపజేస్తూ
'మమ్మీ ' 'పాపా' అని పరిగెత్తుకు వచ్చిన వాళ్లే
వాళ్ళనింకా అదే చూపుతో చూడక్కర్లేదు ...
మన కిరాయి ఆలోచనల్లో ముంచక్కర్లేదు.
పిల్లలకు కలలుంటాయి
రంగులు ,రాగాలూ ఉంటాయి
పిల్లలను పెంచడమంటే మార్కులు ..ర్యాంకులు ..
ప్లేస్మెంట్ లే గా మనకి తెలిసింది
ఈ మూడు ముక్కలాటకు మించిన
నాలుగు దిక్కుని చూసుకున్నారు ఈ పిల్లలే
సిస్టం లో వెతకాల్సింది మూల్యం కాదు
పోగొట్టుకున్న బాల్యమంటున్నారు
ఆ దిక్కును మనల్ని చూడమంటున్నారు.
ఫ్రేమ్ లలో ఒదగ లేమని బాక్సుల్లో బందీలుగా ఉండమని
తెగేసి చెపుతున్నారు
మనం చూసిన దూరాలను మించిన దిగంతాలను
వాళ్లు చూస్తున్నారు.
మనం అలవాటు చేసిన ప్రపంచాన్ని సమాధి చేసి
వాళ్ళు కలలుకంటున్న లోకాన్ని చూడమంటున్నారు
అవినీతి ,అక్రమ ,అన్యాయం ,అరాచకం
మన జాతికి వెరీ నార్మల్
పిల్లలిప్పుడు వాటిని అబ్ నార్మల్ అంటున్నారు
వారు జెన్ జీ లు కదా
జీ హుజూర్ బానిసత్వం వదిలి
ఆత్మగౌరవంతోబతుకు తూ
వారి భాషలో ఏబిసిడిలు మనల్ని నేర్చుకోమంటున్నారు



టెక్నోకిడ్స్‌గా పెంచాం కదా
వీళ్ళకేం ఎమోషన్స్ అనుకున్నాం కదా
రోబో జెన్‌లు
వీళ్ళకేం అనుబంధాలు అనుకున్నాం కదా
జంతర్మంతర్ సాక్షిగా చెపుతున్నారు
వాళ్ల ఎమోషన్స్ ఈ మట్టితో ..
ఈ అణగారిన మనుషులతో ..
తమను చుట్టిన ప్రకృతితో ..
'ప్రశాంత' రేపటితో ...
దీన్ని పేపర్ లీక్ కళ్ళజోడు తో మాత్రమే చూడకండి
వాళ్ళు కోల్పోయిన వ్యవస్థ లో
అపనమ్మక పరాకాష్టగా చూడండి
టియర్గ్యాస్, వాటర్ గన్ ,లాఠీచార్జీలు
వారి మనోబలం ముందు
తల వంచాల్సిందే ననిగుర్తించండి.
ఇది 'జన్' తరం -'మన్'తరం
ఇప్పుడు వారికి మనమే పిల్లలం
క్లై మాక్స్ కొచ్చిన ఈ కథలో
కావాల్సింది ఐ మాక్స్ సీన్స్ కాదు
జెన్ జి గురుకుల పాఠాలు
వారి సిలబస్ను వారి భాష లోనే
నేర్చుకుందాం పదండి.
ఈ వయసులో పిల్లలమై
మేధలో పెద్దలైన వారి గురుత్వంలో
కొత్త వాయువులు పీల్చుకుందాం
కొత్త లోకంలో కొత్త ఆధార్ కార్డు కు
అప్లై చేసుకుందాం
మన పాస్పోర్టును
మళ్లీ కొత్తగా మనమే వెతుక్కుందాం
పదండి వెళదాం
జెన్ జి గురుకులాలకు
'పుడతామా ఏంటి మళ్ళీ'



-అయినంపూడి శ్రీలక్ష్మి
9989928562

## అక్షర కవాతు

అక్కడ అక్షరాలు అమ్మకానికి పెట్టబడ్డాయి
అమాయకపు ప్రాణాలు ఆత్మహత్యలు చేసుకుంటున్నాయి
కంటితుడుపు చర్యలకు కడుపు మండిన కన్నవారు
బిడ్డల భవితల కోసం అల్లాడుతున్నారు.
పని యంత్రాలు ప్రణాళికలు అమలు పరుస్తున్నాయి
ఒక చిన్న కణిక తన గళం సవరించుకుంది
చెలరేగిన ప్రతి రవ్వ తన గొంతుక వినిపిస్తోంది.
పులుల పెత్తనాలకు భయపడే కాలం కాదిది
కొన్నిసార్లు మేకలు పులులై గర్జిస్తాయి
అవి కూడా ప్రాణులని నిరూపించుకుంటాయి.
రాజుకున్న అగ్గి ప్రశ్నల వర్షమై
సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది
కట్టలు తెంచుకున్న ఆవేశపు గుంపులపై
ఆక్రోశం లాఠీలై తాండవం చేస్తున్నాయి.
అవకాశం దొరికిన రాజకీయం
రంగులు పులుముకుంటుంది
పలు పార్టీలు తమ పావులను ఎంచుకున్నాయి.
సందట్లో సడే మియా మృగాలు
రాక్షసత్వపు ఆటలాడుకున్నాయి
ఉత్తుత్తి మద్దతులు పెల్లుబుకుతున్నాయి.
ప్రజాస్వామ్యపు ఐకమత్యపు కవాతు చూసి
ఆధిపత్యం అచ్చెరువందింది
మానవత్వం తన ఉనికిని చాటుకుంది
తరలివచ్చే తోడు కొండంత అండ అయింది.
అన్యాయం ఆట్టే కాలం నిలవదని అందరికీ అర్థమైంది
నిజాయితీ నిలకడగా నిలబడి తీరుతుందని
ఋజువయింది
అక్షరాల ఆటగాళ్ల ప్రక్షాళన
ఊపందుకుంది.



- డా।। సమ్మెట విజయ
99898 20215

## అక్షరాల ఆగ్రహం

అక్కడ
ప్రశ్నాపత్రాలు అమ్ముడుపోయాయి
ఇక్కడ కలలు ఉరితాళ్లకు వేలాడాయి
ఒక్కో మార్కు కోసం
ఏళ్ల తరబడి చెమటోడ్చిన చేతులు
ఒక్క రాత్రిలో
మోసానికి బలయ్యాయి.
అక్షరాలు ఏడ్చాయి
ఆశలు ఆగ్రహించాయి
నిజాయితీ
నిశ్శబ్దంగా మూలన నిలబడి
న్యాయం కోసం ఎదురుచూసింది.
చిన్న గదుల్లో చదివిన పిల్లల కష్టం
వెలుగుల నగరాల్లో
వేలం పాటగా మారినప్పుడు
దేశ భవిష్యత్తు తలదించుకుంది.
కానీ
ప్రతి కన్నీటి బొట్టు
ఒక ప్రశ్నగా మారింది
ప్రతి ప్రశ్న
ఒక ఉద్యమంగా
మారింది
ప్రతి ఉద్యమం
అధికారాన్ని జవాబు అడిగింది.
లాఠీలు ఊగినా..
గొంతులు ఆగలేదు
బెదిరింపులు వచ్చినా..
నిజం వెనక్కి తగ్గలేదు.
చివరకు
ఒక కుర్చీ ఖాళీ అయింది
ఒక సంతకం చరిత్రలో చేరింది
ఒక రాజీనామా
లక్షలాది యువ హృదయాల ఆవేదనకు
సమాధానమైంది
వ్యవస్థకు
జవాబుదారీతనం నేర్పింది
ఇది ముగింపు కాదు
మార్పుకు మొదలు మాత్రమే
అసలు మారాల్సింది
అక్షరాల విలువ..
మారాల్సింది
పరీక్షలపై నమ్మకం..
మారాల్సింది
విద్యను
వ్యాపారంగా చూసే మనస్తత్వం..
ఎందుకంటే దేశాన్ని నిర్మించేది
భవంతులు కాదు
తరగతి గదులు..
దేశాన్ని నిలబెట్టేది
అధికారాలు కాదు
విద్యార్థుల విశ్వాసం..
ఆ విశ్వాసం నిలిచిన రోజే
ప్రజాస్వామ్యం గెలుస్తుంది.
ఆ రోజు ప్రశ్నాపత్రాలు కాదు..
ప్రతిభే మాట్లాడుతుంది
సిఫార్సులు కాదు..
సామర్థ్యమే గెలుస్తుంది
అక్షరాలు అమ్ముడుపోవు
కలలు ఆత్మహత్య చేసుకోవు.
నిజాయితీ మళ్లీ
పాఠ్యపుస్తకంలో కాదు
ప్రతి పరీక్షా మందిరంలో
సజీవంగా నిలబడుతుంది.



-విశ్వైక
సెల్:9550183143



పల్లవి:
జన్ జీ పిల్లలం... జోష్‌కు మేం విల్లులం!
నవ్వుల్లో చిలిపితనం... చదువుల్లో మేం చాంపియన్!
చరణం:
బ్యాగే మా బలం... పుస్తకమే మా స్నేహం,
ఆటలో అల్లరి... క్లాస్‌లో మాత్రం క్రమం!
కలలకి రెక్కలిచ్చే గురుకులం మా ఇల్లు,
జన్ జీ పిల్లలం... మేమే రేపటి వెలుగులం



-శ్రీ వాణి
సెల్:93923 93623




## రెజిలెన్స్ - రెక్కలు మొలిచిన గొంతుకలు

**భావం: అవమానాన్ని ఆయుధంగా మార్చుకున్న యువత**

బొద్దింకలమన్నారా? మేమే లేచాము
రెజిలెన్స్ అనే రెక్కలు తొడిగాము
చీకటి మాటల చుట్టూ తిరిగే
చరిత్ర చక్రాన్ని మేమే తిప్పాము.

కలత చెందిన కళ్ళలో కలలు కదిలాయి
మూగ గొంతులు మాటై మారాయి
శాంతమే మా మార్గం అంటూ
సమసమాజమే మా స్వప్నం అంటూ.

న్యాయ సింహాసనం నుండి పడిన మాట
యువరానికి నిద్ర చెరిపిన వాడి
"అవమానమా?" అని నవ్వి
"అదే మా పాఠం" అని నిలిచాము
అసమానతల అడవిలో
ప్రశ్నల నిప్పులు రాజేశాము.

బొద్దింకకు ఉన్న పట్టుదల
మట్టిలోనూ బతికే బలం
అదే మాలో ఉందని తెలిసింది
అందుకే అడుగు ముందుకు వేసింది
అభ్యుదయమే ధ్యేయమని
ఆకలి కాదు ఆశతో పోరాడింది.

సింధ్య కడలి కలలు కదిలొచ్చాయి
మూగబోయిన నోళ్ళు గళమెత్తాయి
మాటలు తూటాలు కావు.. వెలుగు బాణాలు
కారు మేఘాల రాత్రిని చీల్చే కిరణాలు
ఆ దూరాన ఉషోదయం పిలుస్తోంది
రెజిలెన్స్ పేరుతో కొత్త రోజు నడుస్తోంది.

మమ్మల్ని చిన్నబుచ్చాలని చూశారు
మేము పెద్ద కలతో లేచాము
బొద్దింకలమే .. కానీ
ఒడిపోని ఓర్పుతో, విరగని ఆశతో
యువతరం మేము
విజయ సారధ్యానికి
కదిలాము.



- గాదేపల్లి సూర్యకాంతి
8328629202

## జంతర్ మంతర్ గీతం

మొన్నటి ఉదయం
జంతర్ మంతర్ మెట్లపై
మౌనంగా నిలబడలేదు యువత?
మాటలతో మంటలు రేపింది.
పుస్తకాల నుంచి పుట్టిన స్వప్నాలు
పోలీసు బారికేడ్లను దాటి
వీధులపై వాక్యాలయ్యాయి;
అవి నినాదాలై నడిచాయి.
కళ్ళలో కదిలిన కోపం
న్యాయం కోసం మెలిగిన జ్వాల?
అది అగ్నిపర్వతం కాదు,
అది ఆశల అక్షర విప్లవం.
"మా స్వరం వినిపించాలి" అని
గట్టిగా పలికిన ప్రతీ గొంతు
చరిత్ర పేజీలను తడిపింది;
నిశ్శబ్దాన్ని చెరిపేసింది.
వారే భవిష్యత్తు కాదు,
వారే వర్తమానం?
మార్పు అనే మాటను
మట్టిలో ముద్రించిన మనుషులు.
జంతర్ మంతర్ కేవలం ప్రదేశం కాదు?
అది ప్రతిఘటనకు ప్రతీక,
అది విద్యార్థుల కలల కదలిక,
అది ఒక కొత్త ఉదయం ప్రారంభం.

-మణి వడ్లమాని
9652067891

## రెజిలెన్స్

అత్యుత్తమ న్యాయస్థాన ప్రధాన
న్యాయమూర్తి
పోల్చాడు నిరుద్యోగ యువతను
బొద్దింకలతో
కలత చెందిన హృదయాలతో
యువరం కళ్ళు తెరిచింది
మేం బొద్దింకలమే అంటూ ముందుకు
కదిలింది
వాటి రెజిలెన్స్ తమలోనూ ఉందంటూ
సామాజిక అవకతవకలను
అసమానతలను
ప్రశ్నించడం మొదలు పెట్టింది
తమ మార్గం శాంతియుతమని
మార్పు కోసమే పోరాటమని
అభ్యుదయమే ధ్యేయమని
సమసమాజమే ఆదర్శమంది
సంధ్యా సమయాన-
కలల ప్రపంచం కదిలి రమ్మంది
మొదటి అడుగు పడింది
మూగబోయిన గొంతుకలు
గళం విప్పాయి
మాటలు తూటాలుగా పేల్చాయి
సుదూరంలో-
కారు మేఘాల నిశీధిని దాటుకుని
వెలుగు రేఖల ఉషోదయం
సాక్షాత్కరించేనా?!

-శాంతిశ్రీ
సెల్:98719 89360

## వ్యవస్థీకృత నేరం!

ల్యాబ్ గడప తొక్కలేదు, పుస్తకం విప్పలేదు,
కానీ వైద్య సరంజామా అంతా వచ్చేసింది చాలా నీట్ గా!

గుండె చప్పుడు వినే 'స్టెతస్కోప్' అడగబోయి-
లంచాలు మింగే 'సెక్షన్ స్కోప్' లా వ్యవస్థను వాడేవారు చాలా నీట్ గా!

బాడీ టెంపరేచర్ కొలిచే 'థర్మామీటర్' కాదిది -
పరీక్ష పేపర్ల రేటును పెంచే 'టర్మినేటర్' అని ముందే మార్చేశారు చాలా నీట్ గా!.

మందులు ఎక్కించే 'సిరంజి' తో పనిలేదు -
పేదోడి భవిష్యత్తును పిండేసే 'స్పాంజి' లా దాన్ని మార్చేశారు చాలా నీట్ గా!

ఆపరేషన్ చేసే 'సర్జికల్ బ్లేడు' అడగబోయి -
మెరిట్ విద్యార్థుల గొంతులు కోసే 'పొలిటికల్ బ్లేడు' తో
ప్రాక్టికల్స్ చేసేశారు చాలా నీట్ గా!.
గాయాలకు కట్టే 'బ్యాండేజ్' బదులుగా -
ల్యాబ్ బయటే సాక్ష్యాలకు 'బాండేజ్' నేర్పేశారు చాలా నీట్ గా!.

పేషెంట్ కు ఇచ్చే 'అనస్థీసియా' అనబోయి -
ప్రజలందరినీ మత్తులో ముంచేసే'ఆమ్నేషియా' ఇచ్చేశారు చాలా నీట్ గా!

ఆక్సిజన్ అందించే'వెంటిలేటర్' మీద పెట్టాల్సింది పోయి -
ర్యాంకుల వ్యాపారం చేసే 'ఇన్క్యుబేటర్' లో సీట్లను పెంచేశారు చాలా నీట్ గా!

మైక్రోస్కోప్ లో బ్యాక్టీరియాని చూడటం మానేసి -
'మ్యాక్రోస్కోప్' వేసి సీట్ల రేట్లను పెద్దగా చూస్తూ వ్యాపారం ముగించారు చాలా నీట్ గా!.


బీపీ కొలిచే 'స్ఫిగ్మో మానోమీటర్' అనబోయి -
విద్యార్థులు రక్తాన్ని పీల్చే 'స్మగ్లర్- మానోమీటర్' తో పోరాటాన్ని నిలిపేశారు చాలా నీట్ గా!

ఈసీజీ తీసి గుండె లయను కనిపెట్టడం రాకపోయినా -
లీకేజీ నెట్ వర్క్ కోసం 'టెలిగ్రామ్' గ్రూపుల లయను మాత్రం కనిపెట్టారు చాలా నీట్ గా!.

ప్రిస్క్రిప్షన్ రాయడం నేర్చుకోకుండా నే -
లీకేజీ వీరులతో కలిసి సీట్ల కోసం 'సబ్ స్క్రిప్షన్' ప్లాను గీశారు చాలా నీట్ గా!,

ఎండోస్కోపీ చేసి రోగి లోపలి భాగాలను చూడటం పక్కనపెట్టి -
'విండో-స్కోపీ' (కిటికీ గుండా) పేపర్లు బయటకు తోసేయడం నేర్చుకున్నారు చాలా నీట్ గా!,

గుండె నాళాల్లో బ్లాక్స్ తొలగించే 'బైపాస్ సర్జరీ' నేర్చుకోకుండానే -
రూల్స్ అన్నిటినీ దాటేసి వెళ్ళే'లైసెన్స్ -సర్జరీ' తో సీట్లు కొట్టేశారు చాలా నీట్ గా!,
నీరసించిన రోగికి 'సెలైన్ బాటిల్' ఎక్కించడం తెలియదు కానీ -
మెరిట్ విద్యార్థుల రక్తాన్ని మాత్రం 'వైన్ బాటిల్' లా తాగేస్తున్నారు చాలా నీట్ గా!,
చివరకు ...
రోగాలకు 'ట్రీట్ మెంట్' ఇవ్వడం చేతకాకపోయినా -
లీకేజీ బ్రోకర్లతో'అగ్రిమెంట్' మాత్రం రాసుకున్నారు చాలా నీట్ గా!,
వైద్యో నారాయణో హరిః అనే 'నినాదాన్ని' మరిచి -
నోట్ల కోట్ల కోసమే'విధానాన్ని' మార్చేశారు చాలా నీట్ గా!
స్టెతస్కోప్ తగిలించాల్సిన మెడలో 'సస్పెన్షన్ఆ ర్డర్' పడేలా -
న్యాయం దేవత చేతిలో 'ఫైనల్ జడ్జిమెంట్' రాసి ఉంది
ఇంకా చాలా నీట్ గా!



- సర్వేశ్వరరావు నీలం
630 4664 725



## జయహో... యువతా..!

లాఠీలకు .... తూటాలకు...
అదరకుండా.... బెదరకుండా...
అలుపెరుగని పోరు చేసి
తుది విజయం సాధించింది యువతా ..!
అక్రమాలను దునుమాడి
అన్యాయాన్ని ప్రతిఘటించి
ఆత్మవిశ్వాసం, ఐక్యమత్యమే ఊపిరిగా
జట్టుకట్టింది నేటి నవతా..!
అహింసా విధానాన్ని ఎంచుకొని
పాలకుల మెడలు వంచి
ప్రజస్వామ్య పరిరక్షణకు
పాదులు వేసింది యువతా ...!
యువతరం తలుచుకుంటే
సాధించనిదేది లేదని
చాటి చెప్పిన. మీ పోరాట పటిమ
రేపటి తరానికి స్ఫూర్తిదాయకం
జయహో.. యువతా..!
జయ... జయహో ... నవతా..!
విజేతలారా..!అందుకోండి మా జోతలు
భవితకు మీరే ప్రదాతలు
యావత్ భారతం మీకు హారతులు పట్టుంది
హర్షాతిరేకంతో అభినందనలు చెప్తుంది



-అల్లి మోహన్ రాజ్
9705207615

## తస్మాత్ జాగ్రత్త

రేయింబవళ్లు చదివిన కష్టం చట్టుబండలు!
డాక్టర్ అవ్వాలనే కలలు కన్నీటి పాలు!!
కన్నోళ్ల రెక్కల కష్టాన్ని
కరిగిన రక్తాన్ని కారిన ఘర్మాన్ని
కాసులుగా చేసి ఫీజులుగా మార్చి చెల్లించిన
తల్లిదండ్రుల ఆశలు అడియాసలు.
కానీ ఎవరికి ఎరుక?
మెరిట్ సీటు వెనుక మోసం దాగుందని,
నీటుగా జరగాల్సిన "నీట్" పరీక్ష
కాసుల కక్కుర్తిగాళ్ల లీకులతో ఆగి
ఆశాజీవుల్ని విగత జీవుల్ని చేస్తుందని.
డబ్బున్న దొరబాబుకి మార్కుల వర్షం కురిపించి,
చదివిన పేదోడికి అన్యాయం చేస్తుందని.
ఒకే సెంటర్ లో అందరికీ నూటికి నూరా?
కష్టపడి రాసిన విద్యార్థులకు అత్తెసరు మార్కులా?
గ్రేస్ మార్కుల పేరిట ర్యాంకులు మార్చేస్తారా,
నిజాయితీగా చదివినోడిని రోడ్డున పడేస్తారా?
అమ్మా, నాన్నల ఆశను బతికించడానికి
నెలలకు నెలలే నిద్రకు దూరమయ్యారు,
ఈ దగా సిస్టమ్ చూసాక కళ్ళు చింత నిప్పులయ్యాయి
న్యాయం కోసం నేడు రోడ్లపైకి చేరారు
తమ హక్కుల కోసం
మౌనంగా పోరాటం చేస్తుంటే
గొడ్డుని బాదినట్టు బాదుతారా?
బాష్పవాయు ప్రయోగాలు
బుల్లెట్లు పెల్లెట్ల ప్రయోగాలా?
వాళ్లలో మీ పిల్లలుంటే
ఇలానే రాక్షసుల్లా కొడతారా
మరచిపోకండి
ఈరోజు ఒకరిదైతే
రేపు ఇంకొకరిది
అంతే తేడా
వైద్య వృత్తిని వ్యాపారంగా మార్చకండి,
ప్రతిభ ఉన్నోడి ఆశలను చంపకండి.
నిజమైన డాక్టర్లను దేశానికి ఇవ్వండి,
ప్రజల ప్రాణాలు కాపాడండి
నీట్ స్కామ్ పై నిష్పక్షపాతంగా
న్యాయం చేయండి!
లేకపోతే సీట్లు ఖాళీ చేసి కూర్చోండి.
అంతా ఈ దేశ పౌరులే
ఓటు హక్కు ఉన్నోళ్లే
బదులు తీర్చుకుంటారు
తస్మాత్ జాగ్రత్త



-బంగారు వి బి ఆచార్యులు
98495 79569

## యువ విజయం

చైతన్య కేతనాలు
నినాదాల ఊపిరులు.
స్వార్థ మబ్బుల్ని చీల్చుకుంటూ
యువత
చూపిన సాహసాలు.
బాధల గొడుగులను పక్కనపెట్టి
మేనులు
తూట్లు అయ్యినా
సన్న గిల్లనీ ఆశయాలు.
అక్కడ ఆశలు ఆశయాలు
జీవం పోసుకున్నాయి
లక్ష్యాలను పంచుకున్నాయి.
జంతర్ మంతర్ చైతన్యం
గాలి నిండా నిండిందిపుడు.
అక్కడి నినాదం
ప్రతి శ్వాస ను
కదిలిస్తున్నదిప్పుడు.
అక్కడి లక్ష్యం
అహంకారాలను
కలుస్తున్న ఆయుధ మిపుడు.
అక్కడ ఒకటే మార్గం
భారత భవిష్యత్తు.
లేచిన యువ పిడికిళ్ళు
లేచిన పోలీస్ గుండాల
లాఠీలు
లాఠీల మధ్య యుద్ధ
గీతాన్ని రాసిన చిందిన
రక్తపు చుక్కలు.
లాఠీలను ఒంటినిండా
నింపుకున్న యువ మేనులు.
కనిపించని బతుకు
దారి అమావాస్య చీకట్లో
కమ్ముకున్న భవిష్యత్తులో.
సాగిన యువత అడుగులు
సాధించిన విజయాలు.
యువకులనీటే
ప్రశ్నించేవారు
యువకులు
ధిక్కరించేవారు .
యువ కులంటే పోరాడేవారు
యువకు లనీటే
ఒక్కటయ్యే వారు.
శబ్దం లేకపోవచ్చు
నినాదం రాజీ పడ బోదు
ఆయుధం దారి తప్పింది
సిద్ధాంతం దారి చూపింది,
సూర్యుడు ఒక్కడే
రేపటి ఉదయానికి నాంది
అతడే యువకుడు ,
రేపటి ఉదయం
రేపటి వెలుగు యువకులదే.
మన దేశం ఇప్పుడు
ముళ్ళ తోటలా
రాళ్లకుప్పలా
బురద గుంటల
రక్తదారిలా
దారి తప్పిన అడవిలా ఉంది.
మన దేశం ఇప్పుడు
పొంగిన సముద్రం లా ఉంది
మతాల చిచ్చులో
అవినీతి ఉచ్చులో
విద్వేషాల అగ్నిలో
ఆకలి మంటలో
నిరుద్యోగ నిరాశలో
మత్తుల మాయాజాలంలో
దౌర్జన్యాల ఊబిలో
రక్తం దారిలో గద్దల ఆకాశంలా
ఉంది
లేడి చిమ్మిన నెత్తురులా ఉంది.
శత్రువు అల్లిన పద్మవ్యూహం
గజిబిజిగా ఉంది
వర్తమాన భారతం లో
శత్రువులు ఎవరు .
భారతదేశాన్ని
చీకటి చేసిన దొంగలు ఎవరు.
మతం మత్తు జల్లి
మాయ చేస్తున్న
దోపిడీ దారులు ఎవరు
ఓ యువకులారా
జనం వేరు వేరు కాదు.
వేరు చేయ
చూసిన మోసగాళ్ల పని
పట్టాలిప్పుడు
ఓట్ల రక్షణ కోసం
కోటి అడుగులు
మరొక్కమారు ఒక్కటయ్యి
నడవాలిపుడు
యువకుడా ......
నీ అడుగే మొదటి అడుగు
నీ పిలుపే దేశ పిలుపు
నీ మాటే దేశ జాగృత గీతం ..



-సిరిసిల్లా
గఫూర్ శిక్షక్
9849062038

# కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి 8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ



## భాష్యం చెప్పే మౌనం

ప్రేమలో మౌనం మధురం.!
మాటలు లేని నిశ్శబ్దం.!
కోపాలు తాపాలు మాయం.!
కనుల భాషకు భాష్యం.!.

హృది లయ కాదు దూరం.!
నిశ్శబ్దమే నాకు ఇష్టం.!
అలక లేకుంటే అందం.!
మౌనం అంటే పరవశం!.

రెప్పలలో దాగే కాంతి.!
అనిపిసీచు కదా భ్రానీతి.!
తలిస్తేనేమో విభ్రానీతి.!
ఆనందము అనే స్థితి.!.

సరదాల ఆచూపులు.!
పక్కన నడిస్తే చాలు.!
నావైపు చూసే నవ్వులు.!
ఇచ్చే కొత్త వెలుగులు.!.

కాలం ఇలా ఆగిపోనీ.!
కల నిజమై సాగనీ.!
నీడలా ఎప్పటికినీ.!
నన్ను నీలో దాచుకొనీ.!.

**-యలమర్తి మంజుల**
విశాఖపట్నం

## మౌనం...

నా మౌనం అంగీకారం కాదు...
నీ తప్పులకు నేను ఇచ్చిన సమ్మతి కాదు...
చేతకానితనానికి గుర్తు కాదు...
ఓడిపోయిన మనసు వేసుకున్న ముసుగూ కాదు.
అది నా సంస్కారం...
నా సహనానికి నేను గీసుకున్న హద్దు...
అనవసరమైన గొడవల కంటే
మనశ్శాంతిని ఎక్కువగా ప్రేమించిన నా నిర్ణయం.
ప్రతి రాయికి ఎదురుగా
రాయి విసరడం నాకు రాదు...
బురదలో దిగితే
మురికి నాకే అంటుతుందని తెలుసు.
అందుకే మౌనాన్ని ఎంచుకున్నాను...
బలహీనతతో కాదు, బలంతో...
కానీ గుర్తుంచుకో...
మౌనం మాట్లాడే క్షణం వస్తే,
నిజం ఉరుములా వినిపిస్తుంది.
నువ్వు దాచిన ముఖాలు ఒక్కొక్కటిగా జారిపోతాయి...
నీ అన్యాయాలు వెలుగులో నిలబడి
నిన్నే ప్రశ్నిస్తాయి.
అప్పుడు నేను ఏమీ చెప్పాల్సిన అవసరం ఉండదు...
నిజమే నీ గురించి మాట్లాడుతుంది.
కాలమే నీకు తీర్పు చెబుతుంది.
అందుకే...
నా మౌనాన్ని తక్కువ అంచనా వేయకు.
అది ప్రశాంతంగా కనిపించే సముద్రం మాత్రమే...
అలలు లేవని కాదు...
ఒక్కసారి తుఫానై లేస్తే,
తీరాలే తమ రూపాన్ని మార్చుకోవాల్సి వస్తుంది.

**-తనూజ వెంకట్**, గౌరీబిదనూరు

## ఇకనైనా ఎలుగెత్తుదాం

తోటకూర నాడే అన్న సామెతలా..
దారితప్పుతున్న సంతానాన్ని..
హద్దు పద్దుల్లో,
నైతిక విలువలతో కూడిన
మంచి దారిలో పెట్టని
తల్లిదండ్రుల పెంపకం గురించి!

అసభ్య అశ్లీల దృశ్యాలను గుప్పించే
మాధ్యమాల గురించి!

ఆడదంటేచిన్నచూపును,
అలుసును,భోగవస్తువనే భావనను
నరనరాల్లో నింపుకొన్న
కామాంధుల గురించి!

యువత చైతన్యాన్ని సరైన
దారిలోకి మళ్ళించలేని..
దిశానిర్దేశం చేయలేని
సమాజాన్ని గురించి!

బాధ్యతాయుత ఉద్యోగుల అలసత్వ,
నిర్లక్ష్య లక్షణాలను గురించి!

నిందితులకిచ్చే రక్షణను
బాధితులకివ్వలేని
చట్టాల గురించి!

ఘోరాలకు కారణమయ్యే మూలాలను
నిషేధించలేని...
ప్రభుత్వాల కార్యశూన్యత,
అధికార లాలస గురించి!

అన్నీ కలిసి అసహాయులైన
అబలల ఉసురు తీస్తుంటే...
మిన్నకుండకుండా ఇకనైనా
మౌననిశ్శబ్దాన్ని ఛేదిద్దాం!
ఎలుగెత్తి మాటాడుదాం!.

**-చంద్రకళ.దీకొండ**
మల్కాజిగిరి

## మంద్రంగా మంత్రపుష్పం

మౌనం నిశ్శబ్దానికి నిలువుటద్దం కాదు
అంతరంగానికి అనువైన నెచ్చెలి
మనసుతో ముచ్చటించే మత్తకోకిల
మనోభావాలు తెలిపే మల్లెల పరిమళం.

మౌనంలో మనకు తెలియని మణులెన్నో!
ఆలోచనలకు పదును పెట్టక..
అక్కడే దాగిన విజ్ఞాన నిక్షిప్తాలు!
వెలికి తీస్తే వెలుగుల జాతరలే!
పైకి కనిపించని మధుర చెమ్మల
కమనీయ తేనె చెక్కిలి!.

జ్ఞాన సౌరుల చెమరింతలతో మురిసిపోయే
వసంత కాలపు వనాల వాలుజాడ!
మౌనానికి లిపి లేదు కానీ
చిలిపి తనానకి చివుళ్ళయి కదలాడు.

గుండెల్లో రగిలే జ్వాలలకు
ఘనీభవించిందేమో మౌనం..
ప్రణయాలకు ఉసురు పోస్తే మాత్రం
పాదరసానికే తాతపాదుల వారు!.

అందుకే..
మోడువారిన మనసును మొలకెత్తించండి
విరుల వనం లా వికసించండి
తొలకరికి పులకించే తరువులా
మందస్మిత యైన మౌనానికి మాటలొస్తే..
మంద్రంగా మంత్రపుష్పం నీకర్పిస్తుంది!!.

**-ఆకుమళ్ళ కృష్ణదాస్**
నంద్యాల


# ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి: సుదర్శన్ రెడ్డి

బోధన్ జులై 29: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి నమోదు పూర్తయ్యేలా అధికారులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచించారు.

బోధన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలాల వారీగా ఎస్ఐఆర్ నమోదు పురోగతిని సమీక్షించి, ఇంకా నమోదు చేసుకోని అర్హుల వివరాలను గుర్తించి వారిని నమోదు కేంద్రాలకు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నమోదు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే గ్రామస్థాయి నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



జులై 28న డిల్లీ లో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వారు నిర్వహించిన తెలుగు వెలుగు వేడుకలలో జ్ఞాన పీఠ అవార్డ్ గ్రహీత డా॥ సి.నారాయణరెడ్డి గారి జయంతి సందర్భంగా కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ గారిచే **'జాతీయ వాగ్దేవి ప్రతిభ పురస్కారం'** అందుకుంటున్న తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ నామోజు బాలాచారి, బడేసాబ్.

## మసకబారని చైతన్యం

మనిషి జీవన ప్రస్థానంలో
బాల్యం, కౌమారం,యవ్వనం, వృద్ధాప్యం
పరిణామాలన్నీ ఒకదాని వెంట మరొకటి
ముందుకు రావటమనేది
ఒక సహజ వ్యవస్థ
ఒకదాని వెంట ఒకటి
కోల్పోయిన చైతన్యంతో
అశక్తుడై అందరి సహకారం
అర్థించాల్సి వస్తుంది
పలకరింపులు పరామర్శలను
దీనంగా ఆహ్వానించుకోవాలి
చివరి మజిలీ ముందుకు దూసుకువస్తుంటే
హృదిన విలాపం ఆవరిస్తుంది
మా ఇంటిముందున్న వేపచెట్టుకి
అవేమీ లేనట్లే అగుపిస్తుంది
మన ఆలోచనలను తన వైపుకి
మరల్చుకుంటుంది
ఏ పక్షో రాల్చిన గింజొకటి
కల్లాకపటమెరుగని
మట్టినేలకు
ఆకుపచ్చని రంగుని అద్దుతుంది
అక్కడ మొలిచిన మొలక
ఇప్పుడు ఇంతై ఇంతింతై
ఓ ఘనమైన చెట్టవుతుందని
అప్పటి వారు ఊహించివుండరు
నాటినుండి నేటిదాకా
ఎల్‌నినోలెన్ని వెంటాడినా
చెదరని, కదలని
శిల్పంలా నిలిచింది
అల్లరి పిల్లలు ఆటలాడుకుంటూ
రెమ్మలను తుంచినా
కొమ్మలను విరిచినా
పుల్లలతో పళ్ళు తోముకున్నా
రాలిన పండ్లకై
పక్షులు ఎగబడినా
ఆనందమేకానీ
అవమానాన్ని మోయదు
అప్పటి తరం గతించినా
వాళ్ళ జ్ఞాపకాలను
ఇప్పటితరానికందించే
ఒక చరిత్రకారిణి అది
గూడుకట్టుకున్న పక్షులు
పొద్దున్నే ఆకలి వేటకెళ్ళి
పొద్దుకుంకగానే అరుదెంచే
వాటికోసం ఎదురుచూసే
ఓ కన్నతల్లి అది
రచ్చబండ కబుర్లను శ్రద్ధగా విని
గతం, వర్తమానాలని కలిపే
రాచబాట అది
బోధివృక్షమే కాదు
మా ఊరు వేపచెట్టూ
ఒక జ్ఞానప్రసాదినే
మసకబారని చైతన్యంతో
చెట్టునీడన చిరుగాలినందించే
వరప్రదాయని అది



( ఉండవల్లిలో తెలుగు మహోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతికశాఖ 'చెట్టునీడన చిరుగాలి' అనే అంశంపై చదివిన (25.07.2026) కవిత.)

**-పొత్తూరి సుబ్బారావు**
సెల్:94907 51681

# ఘనంగా దాశరథి సంస్మరణ సభ



సభలో ప్రసంగిస్తున్న డా॥నాళేశ్వరం శంకరం. వేదికపై కళా జనార్ధనమూర్తి, ఎస్.బి.రామ్, జి. గీతాదేవి, శంకరప్రసాద్

హైదరాబాద్, జులై 29: చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ఎందరో మహానుభావులు మధుర స్మృతుల్లో భాగంగా బుధవారం తెలంగాణ వైతాళికుడు, కవి దాశరథి కృష్ణమాచార్యుడి సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీవేత్త, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ.. నిజాం రాజాకార్ల దుర్మార్గాలను వ్యతిరేకిస్తూ తెలంగాణ విమోచన కోసం కలంపట్టిన దాశరథి తన రచనలతో అణగారిన వర్గాలకు అండగా నిలిచారని కొనియాడారు. ఉద్యమశీలిగా కలం, గళంతో దిక్కార స్వరంతో నిజాంను ఎదిరించి జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు. నిజామాబాద్ జైలు గోడలపై రాసిన గీతాలు నాటి నిజాం పాలకులపై అగ్నిధారలను కురిపించాయని వివరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్.బి.రామ్, జి. గీతాదేవి, శంకరప్రసాద్ పాల్గొన్నారు.

# జూపాక సుభద్ర 'గునుగుపూలు' ఆవిష్కరణ




పుస్తకావిష్కరణలో అతిథులు జాజులగౌరీ, పసునూరి రవీందర్, జూపాక సుభద్ర, బి.యస్.రాములు, బాణాల సాలమ్మ తదితరులు.

హైదరాబాద్, జులై 29: తెలంగాణ జీవభాషతో తెలుగు సారస్వతానికి సొగసులద్దిన విద్వత్తేజం జూపాక సుభద్ర అని వక్తలు అభివర్ణించారు. సోమవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో సుభద్ర ఆత్మకథనం 'గునుగుపూలు' పుస్తకావిష్కరణ సభ కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డా॥పసునూరి రవీందర్ అధ్యక్షతన జరిగింది. బెల్లంపల్లి పోలీసు కాల్పుల బాధితురాలు దుర్గక్క పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతిని తెలంగాణ డక్కలి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బాణాల సాలమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా పసునూరి రవీందర్ మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం అనుబంధంలో జూపాక సుభద్ర అనుభవాల సమాహారమే ఈ గునుగుపూలు పుస్తకమని పేర్కొన్నారు. బి.యస్. రాములు, జాజుల గౌరీ, తాళ్ళపల్లి యాకమ్మ, దుర్గ రవీందర్, రచన ముద్రబోయిన, కోట విజయ, మారోజు దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కరీంనగర్, జులై 29:గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య సూచించారు.

బుధవారం చందపల్లి 17వ వార్డు, పెద్దమ్మనగర్ ఎస్ఆర్ఎస్పీ కాలువ, రంగంపల్లి 11వ వార్డు సాయి గార్డెన్, రాంపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీల్లో వర్షపు నీరు చేరిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1830వ రోజు 'రోడ్డు భద్రత' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'రోడ్డు భద్రత' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:

**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** 9441046839



## హడావిడి!

సమయపాలన పాటించక
ఆదరాబాదరా ఉరుకులు పరుగులు
వాహనాలపోటీ
తలకాయలు ఢీ
పొగలుకక్కే
బుసలుకొట్టే కుర్రకారు
రయ్ రయ్ న హెల్మెట్ లేక
చెవిలో సెల్లుతో అష్టవంకరలు
కారులో సీటు బెల్ట్ పెట్టక పయనం
పూటుగా మందుకొట్టి
అర్ధరాత్రి షికార్లు
కారు టైర్ పంచర్
బతుకు ఎడ్వెంచర్.
ఇంటి నుంచి పయనం
ప్రాణాలు అరచేత బట్టి
గమ్యంచేరేదాకా
దినదినగండం నూరేళ్లాయుష్షు.
వర్షపు నీటిగుంటలు
జర్రుబుర్రు జారుడు
బొక్క బోర్లా పడుడు
ట్రాఫిక్ పోలీసుని
ఈడ్చుకెళ్లే మందుబాబులు
పండ్ల కూరగాయల పై కాలు
జారుడు బండఫీట్లు.
ఫుట్ పాత్
జీబ్రాక్రాసింగ్ పై నడక
కుడి ఎడమల చూస్తూ
ఒకరిచేయి ఒకరుపట్టుకు
రోడ్డు దాటితే సులభం సురక్షితం.
బడిలో రహదారి భద్రతా క్లబ్ తో
బాలలకి అవగాహన
నిదానం ప్రధానమని బోధన
క్యూలో నించుని ఎక్కాలి దిగాలి
బాటపై నడక బతుకు పోరాటానికి
తొలి మెట్టు
గమ్యం చేరే తొందర వద్దు
ఉండాలి మనసుకి హద్దు
శరీరభాగాలు విడివడే
హడావిడి వద్దేవద్దు.

**-ఎ.రాజ్యశ్రీ**

## అభద్రతా భావంతో!

ట్రాఫిక్ సుద్దులు మరిచిన
వాహన ప్రయాణం
హద్దులు మీరిన వేగంతో
ప్రాణాలను గాలికి వదిలేస్తూ
విలాసాల మోజుల్లో
బతుకుతున్న
నేటి జీవితం..
ట్రాఫిక్ రూల్స్ ని పాటించరు
వెనుక నుంచి గుద్దేస్తారు అతి వేగంతో
ముందునుంచి సైలెంట్ గా కుమ్మేస్తారు
లైసెన్సు లేని డ్రైవింగుతో.
ముందూ వెనుకా చూడలేని మైకంలో
మందుబాబులు రోడ్డెక్కిస్తున్నారు
వాహనాలను
మత్తుల్లో తూగుతూ
జోగుతూ చస్తున్నారు..
ఎదుటివారినీ చంపేస్తున్నారు
యాక్సిడెంట్లతో.
వద్దంటున్నా
కూడదంటున్నా
రోడ్డుపైనే
చరవాణితో అచ్చట్లూ
ముద్దుల ముచ్చట్లూ
గమనించని మలుపులు
ట్రాఫిక్ రూల్స్ అతిక్రమణ
ఆపదలను ప్రాణాల మీదికి
కొని తెచ్చుకుంటున్న
నేటి ఉడుకు రక్తం..
వేగంకన్న ప్రాణం మిన్న
అని తెలుసుకోరు
బాధ్యతలను గుర్తించరు
క్షణం క్షణం
ఏక్షణమేమవుతుందోనని
ప్రాణాలు గుప్పెట్లో
ఇంటింటా విషాదం
కోల్పోయిన బంధాలతో..

**- పి.పద్మావతి**

## ప్రయాణం కాదు ప్రాణం చూసుకో

ప్రయాణాలు రెండు
మొదటి ప్రయాణం
సంతోషకరం.
పెండ్లి పిక్నిక్
ఫ్రెండ్స్ కొరకు
దైవదర్శనం
అన్ని ఆనందభరితాలే
అదే అభద్రత వల్ల
అంతిమ ప్రయాణంగా
ప్రాణాపాయస్థితిగా మారడం
నిత్య కృత్యమైంది.
కారణాలు వెతుకుతూ
కన్నీళ్లు కారుస్తున్నాం
రోడ్లమీద రక్తం
నీళ్లలా పాడడం తగ్గలేదు
కారణాలు అనేకం
మాయనిగాయాలు
మనుషులను పోగొట్టుకున్న
మానసిక రణాలు
దినదిన ప్రవర్ధమానం
ప్రభుత్వం ప్రజలు
కలిసి చేపట్టాలి
సురక్షిత ప్రయాణ సూత్రం.
వెంటనే అమలు చెయ్యాలి
భద్రత సూత్రాలు.
స్పీడు తగ్గించు
ఓవర్ టేకులొద్దు
నిద్ర వస్తే వెహికల్ స్టాప్
మందుకొట్టి స్టీరింగ్
ముట్టుకోకు.
దూర ప్రయాణం
ఒక్కడ్రైవర్ ప్రమాదం.
అలసట లేని ప్రయాణం
అధిక లాభం.
యమ స్పీడు-పోతావు
యమపురికి.

**-డా.సి.వసుంధర**

## అలసత్వం వీడు

చిన్నా పెద్దా దూరంకైనా
ఏదో ఒక వాహనం
ఆడా మగా తేడాలసలే లేవు
అలసత్వం వీడాలంతే ....
శిరస్త్రాణం ధరించే
నిమిషాన్ని నిర్లక్ష్యం చేస్తే
పూలపాన్పులాంటి
జీవితాన్ని కోల్పోతాం.
కారు బెల్టును కట్టవోయి
జోరు కాస్త తగ్గించవోయి
అతివేగం మితిమీరకు
గతి తప్పితే తిప్పలని మరువకు.
ప్రమాదాలకు పుట్టిల్లని తెలిసినా
ప్రమోదాలను మింగేస్తుందని తెలిసినా
వేగాన్ని ప్రేమించే యువత
గాయాన్ని తట్టుకుంటుందా?.
పాటించు రోడ్డు భద్రత
నియమాలను నిక్కచ్చిగా
చిందించు చిరునవ్వులను
అందించు బహుమానం
నీ క్షేమం కొరకై ఎదురుచూస్తున్న
కుటుంబ సభ్యులకు.

**-నగునూరి రాజన్న**

## అప్రమత్తత

ఒక్క క్షణం
ఒకే ఒక్క క్షణం
ఆలోచనలు పక్కదారి పట్టినా
ఏమరుపాటు వల్ల
తప్పని తిప్పలు!!.
తెల్లవారుజాము
కన్ను నిద్రకు తోడై
ఒక్క క్షణం మూతపడితే
బండి గోల్మాల్
ప్రాణాలు గాలిలో!!.
దారితప్పిన బిడ్డలు
అప్రమత్తంగా లేని కన్నవారు
ఎర్ర లైటు కానని గుడ్డివారు
చెవిలో జోరీగ సెల్ తో చెవిటివారు
శిరస్త్రాణం ధరించక విచిత్రం
స్వేచ్ఛగా ఎగిరిపోతూ
కొనితెచ్చుకున్న ప్రమాదాలు
చిత్తవుతున్న బతుకులు!!.
నడుస్తున్నా వీడని చరవాణి
హారన్ కొట్టినా వినక
ఆస్పత్రి పాలు
కారులో సీట్ బెల్ట్ పెట్టని దుస్థితి
దారితప్పుతున్న వాహన దారులు
సామాన్య జీవి అవస్థల పాలు!!.
అప్రమత్తంగా ఉండి
బాల శ్రీకృష్ణ దేవరాయలను
అరిబారి నుండి
కాపాడిన తిమ్మరుసు
తెలివి ఎంత వున్నా
ప్రమత్తత లేకుంటే ప్రమాదం!!.
మత్తులో గమ్మత్తు
ప్రేమతో చిత్తు
స్వేచ్ఛకు తొత్తు
బాధ్యత మరచిన నవలోకం
వేగంగా నడుపుతూ
అధోగతిపాలు
పక్కవాడికి మూడిన
గ్రహచారం!!.
వేదనతో కుటుంబాలు
ఎటు పోతోంది సమాజం!!.
పొంచివున్న ప్రమాదం
ఏ క్షణంలో ఏమౌనో?
ఎవరికెఱుక?.
సుఖమనుకుంటే
దుఃఖం ఎదురు
మనిషి చేసిన తప్పో
అజాగ్రత్తనో
ఏదైతేనేం జనాలకు ఇక్కట్లు
విధిరాత తప్పదు మరి!!.
మనిషికి ఉంది మాట్లాడే హక్కు
తిరిగే స్వేచ్ఛ
కట్టుబాట్లు
నియమాలు లేకుంటే
ప్రమోదం కాస్త అవుతుంది ప్రమాదం!!.

**-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి**

## హెల్మెట్ రక్షణకవచం

అతి వేగం అనర్థదాయకం
వాయువేగంతో నేటి యువత
వాహన చోదక పోటీ
మనో వేగంతో
ఏకాగ్రత లేని ప్రయాణం.
కొత్త హంగులతో వస్తున్న వాహనాలు
ఉరకలేసిన ఉత్సాహం
అపరిమిత వేగం .
గాలిలో తేలినట్టుందే
కూనిరాగాలతో
కేరింతల, పులకరింతల
అతివేగ పయనం
ప్రాణాలు గాలిలో
విగతా జీవులై
కన్నవారికి
మిగిలిన కడుపు కోత
తల్లి దండ్రుల పర్యవేక్షణ కరవు
పెడదోవ లో యువత పయనం
చెడు స్నేహం
పరిచయాలు
మాదక ద్రవ్యాల దోస్తీతో
వ్యసనమై జీవనమే కుస్తీ
ప్రమాదాల బారిన పడితే
అంగవైకల్యమో
అత్యవసర చికిత్సలతో
కన్నవారికి తోబుట్టువులకు.

**-ఇమ్మడి రాంబాబు**